



● వేమూరులో ఆలపాటికి మద్దతుగా మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి, వేదికపై మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు

● సమీపిస్తున్న ఎమ్మెల్సీ ఎన్నికలు
● గుంటూరు జిల్లాలో అత్యధికంగా గ్రాడ్యుయేట్లు
● జోరు పెంచిన కూటమి
● శ్రేణులతో మంత్రులు.. ఎమ్మెల్యేల భేటీలు
● పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతుగా వామ పక్షాలు.. ఉద్యోగ సంఘాలు
● బరిలో 25 మంది అభ్యర్థులు

గుంటూరే.. కీలకం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు ఓటముల్లో గుంటూరు జిల్లా పట్టభద్రుల ఓటర్లు కీలకంగా మారారు. ఈ జిల్లాలోనే అత్యధికంగా ఓట్లు ఉన్నాయి. అన్ని జిల్లాల కంటే అధికంగా 1,08,109 ఓట్లు గుంటూరు జిల్లాలోనే ఉన్నాయి. చాలా తక్కువగా ఏలూరు జిల్లాలో 16,099 ఓట్లు మాత్రమే ఉన్నాయి. కృష్ణా జిల్లాలో 63,114 ఓట్లు, ఎన్‌టీఆర్ జిల్లాలో 78,063 ఓట్లు, పల్నాడు జిల్లాలో 57,238 ఓట్లు, బాపట్ల జిల్లాలో 24,493 ఓట్లు ఉన్నాయి. గుంటూరు పట్టణంలోనే అత్యధికంగా ఓట్లు ఉండటంతో ఇక్కడ పట్టు సాధించేందుకు ఎమ్మెల్సీ అభ్యర్థులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

● కృష్ణా.. గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ 27న జరగనుంది. సమయం దగ్గర పడుతుండటడంతో అభ్యర్థులు ప్రచారాన్ని ఉధృతం చేశారు. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపును కూటమి పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. గెలుపు కోసం గ్రాడ్యుయేట్‌లతో పాటు ఉపాధ్యాయులు, ఉద్యోగుల మద్దతును కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎక్కడికక్కడ ఓటర్లతో సమావేశాలు నిర్వహించడంతో పాటు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. మండల.. పట్టణ స్థాయిలో ఎమ్మెల్యేలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా వామపక్ష పార్టీలు.. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నేతలు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఓటర్ల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు ఇచ్చి లక్ష్మణరావుకు ఓటు వేయాలని కోరుతున్నారు.

● కూటమి అధికారంలో ఉండటంతో ఎమ్మెల్సీ ఎన్నిక ఆ పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలకు ఎన్నిక బాధ్యతలను అప్పగించి టీడీపీ అధిష్ఠానం ఎప్పటికప్పుడు ఎన్నికల ప్రక్రియపై సమీక్షిస్తోంది. ఎమ్మెల్సీ బూత్ స్థాయిలో 30 మంది ఓటర్లకు ఒక కార్యకర్త పనిచేస్తున్నారు. ఎమ్మెల్యేలు ఎప్పటికప్పుడు బూత్ స్థాయి కార్యకర్తలు, నేతలతో సమన్వయం చేసుకుంటూ ప్రచార సరళిని గమనిస్తున్నారు. మంత్రులు.. ఎంపీలు కూడా ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆలపాటి మద్దతుగా వారు ప్రచారం నిర్వహిస్తున్నారు. భారీ మెజార్టీతో గెలుపే లక్ష్యంగా కూటమి నేతలు క్షేత్ర స్థాయిలో ఓటర్లను కలుస్తున్నారు. ఎమ్మెల్యేలు తమ సొంత ఎన్నికగా ఎమ్మెల్సీ ఎన్నికను స్వీకరించారు. ఆలపాటి భారీ మెజారిటీనే లక్ష్యంగా ఎమ్మెల్యేలు పావులు కదుపుతున్నారు. గెలుపు లాంఛనమే భారీ మెజార్టీనే లక్ష్యమని ఎమ్మెల్యేలు చెబుతున్నారు.

● లక్ష్మణరావుకు బలం ఉద్యోగులు.. ఉపాధ్యాయుల యూనియన్లు. ఇరువురికి పట్టభద్రులతో మంచి సత్సంబంధాలు ఉన్నాయి. సోషల్ మీడియా ద్వారా ప్రచార హోరు పెంచారు. వామపక్షాలు.. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు లక్ష్మణరావు వైపు నిలిచాయి. ఈ ఎన్నికలలో వైసీపీ పోటీలో లేకపోవడంతో ఆ పార్టీ పరోక్షంగా లక్ష్మణరావుకు మద్దతు తెలిపే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం జరుగుతోంది.



వినుకొండలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, జీవీ, మక్కెన



సత్తెనపల్లి: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంఎల్‌సీ పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు



167 ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న సహకార సంఘాలు

520 పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య

30 ప్రస్తుతం జీతాలు రాని సహకార సంఘాలు

● జీతాలకోసం ఆరునెలలుగా సొసైటీ ఉద్యోగుల ఎదురు చూపులు
● ఉమ్మడి జిల్లాలోని 30 సహకార సంఘాల్లో ఇదే పరిస్థితి

వడ్డీ వాత జీతం కోత


గుంటూరు సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు విధివిధానాలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో పనిచేసే ఉద్యోగుల పాలిట శాపంగా మారాయి. వసూలు చేసిన వడ్డీలో 30 శాతం మాత్రమే జీతాలకు వినియోగించుకోవాలన్న నిబంధన ఉద్యోగులకు ప్రతిబంధకంగా మారింది. దానివల్ల ఉమ్మడి జిల్లాలోని చాలామంది ఉద్యోగులు గడచిన ఐదారు నెలలుగా జీతాలు అందక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోని 30 సహకార సంఘాల్లో ఈ పరిస్థితి నెలకొని ఉన్నట్లు తెలుస్తోంది. అయినా జిల్లా అధికారులు ఏవిధమైన చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

30 సంఘాల పరిస్థితి మరీ ఘోరం..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 30 సహకార సంఘాలు ఈ ఏడాది రుణాల వసూళ్లలో వెనుకబడి ఉన్నాయి. దానివల్ల ఆయా సంఘాల్లో పనిచేస్తున్న సుమారు 110 మంది ఉద్యోగుల కు గత ఆరునెలలు గా జీతాలు రావటం లేదని తెలుస్తోంది. ఒక వేళ నిబంధన మీరి జీతాలు తీసుకున్నా దాని బాధ్యత కార్యదర్శి పై పెడుతుండటం తో ఎవరూ సాహసాలు చేయడం లేదు.

చేయూత నిస్తే...

వాస్తవానికి ఉమ్మడి జిల్లాలోని సహకార సంఘాలు అన్నీ ఒకప్పుడు మంచి వెలుగు వెలిగినవే. లాభాల బాటలో ఉన్న వాటిని కోరి కష్టాల పాలు చేశారు. ప్రభుత్వం తలచుకుంటే మళ్లీ పూర్వ స్థితికి తీసుకురావచ్చునని సహకార సంఘాల నేతలు చెబుతున్నారు. రైతులతో ముడిపడిన ఎరువుల అమ్మకాలు వంటివి సొసైటీలకు అప్పగిస్తే ఉద్యోగుల జీతాల కు ఇబ్బందులు ఉండవని చెబుతున్నారు. ఒక యూరియా బస్తా అమ్మితే రూ. 6.25 లాభం కింద చెల్లిస్తారని అంటున్నారు. యూరియా బస్తా విలువ రూ. 266 అయితే బయట వ్యాపారులు రూ. 350 వరకు విక్రయిస్తున్నారు. మార్క్‌ఫెడ్‌కి వస్తున్న స్టాక్‌లో ఎక్కువ భాగం ప్రయివేటు వ్యాపారులకే వెళ్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వం ఎరువులను సహకార సంఘాల వద్ద నుంచి తీసివేసి రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయాలు జరిపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ సహకార సంఘాల ద్వారా ఎరువుల విక్రయాలు జరుపుతున్నారు. ఇదే పద్ధతి కొనసాగించి పూర్తిగా ఎరువులను సహకార సంఘాల కు కేటాయిస్తే ఉద్యోగులు నెల నెలా జీతాలకు ఇబ్బందులు పడకుండా ఉంటారని సహకార ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు అన్నారు. కూటమి ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



30 శాతం నిబంధన ఏమిటంటే..

సహకార సంఘాల ద్వారా మంజూరు చేసే రుణాలకు వడ్డీ వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు ఒక సహకార సంఘం నుంచి రూ. కోటి వరకు రైతులకు రుణాలు మంజూరు చేస్తే దానిపై వడ్డీ వస్తుంది. ఆ వడ్డీలో 30 శాతం జీతాలకు , 20 శాతం నిర్వహణకు వినియోగించాలి. వాస్తవానికి రైతులు తీసుకున్న కోటి రూపాయల అప్పును ఒకే సారి చెల్లించే పరిస్థితి ఉండదు.అందులో సగ భాగం మాత్రమే జమ వేస్తారు. అయినా సహకార సంఘం రూ. కోటి కి జిల్లా బ్యాంకుకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఇటువంటి పరిస్థితి వల్ల సహకార సంఘా లు ఆర్థిక లేమి వల్ల కునారిల్లే పరిస్థితి ఏర్పడుతోంది. వడ్డీలో కేవలం 30 శాతం మాత్రమే జీతాలకు వినియోగించాలన్న నిబంధన వల్ల చాలా మంది ఉద్యోగుల కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



అవయవాలను తరలిస్తున్న సిబ్బంది

మరణిస్తూ.. మరొకరికి జీవితం

● విజయవాడ మహిళ అవయవదానం
● ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ ● కుటుంబ సభ్యుల అనుమతితో అవయవదానం ● ప్రభుత్వ లాంఛనాలతో అంత్య క్రియలు



ఎం.సరస్వతి (ఫైల్)

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయ పడిన మహిళ మరణిస్తూ మరి కొందరికి జీవితానిచ్చారు. విజయవాడ భవానీపురానికి చెందిన ముత్యాల సరస్వతి (54) ఈ నెల 14వ తేదీన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం మం గళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఐదు రోజులపాటు వెంటిలేటర్‌పై చికిత్స అందించిన వైద్యులు, మంగళవారం సరస్వతి బ్రెయిన్ స్టెమ్ డెడ్‌కు గురైనట్టు నిర్ధారించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియపర్చి, అవయవదానం పై అవగాహన కల్పించారు. సరస్వతి కుటుంబ సభ్యులు, బంధువులు అవయవదానం చేసేందుకు అంగీకరించడంతో బుధవారం సాయంత్రం ఆ ప్రక్రియను పూర్తిచేశారు. ఈ సందర్భంగా తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సిన్హా మాట్లాడుతూ అవయవ దానం చేసేందుకు సరస్వతి కు టుంబ సభ్యులు ముందుకు రావడం పట్ల ధన్యవాదాలు తెలియజేశారు. దాత శరీరం నుంచి రెండు కిడ్నీలు, లివర్, రెండు నేత్రాలను సేకరించి మణిపాల్, ఎయిమ్స్, ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రులకు పంపుతున్నట్టు తెలిపారు. అవయవదాతల త్యాగాన్ని గౌరవిస్తూ దాతల అంత్యక్రి యలను ప్రభుత్వ లాంఛనాలతో చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అహంతెమ్ శాంతా సింగ్, గుంటూరు డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, ఎయిమ్స్ వైద్యులు పాల్గొన్నారు.


ఉపాధి చెల్లింపులేవి?

● రెండు నెలులుగా అందని కూలి ● నేటికీ కొలతలు కూడా వేయని వైనం ● ఆందోళనలో కూలీలు

బల్లికురవ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో రెండు మాసాల కిందట ఉపాధి హామీ పథకం ద్వారా చేసిన పనులకు నేటికీ కూలీలకు డబ్బులు చెల్లించలేదు. కనీసం చేసిన పనులకు కొలతలను కూడా వేయలేదని, అధికారుల నిర్లక్ష్యంతో కూలి అందలేదని 2వేల మంది కూలీలు వాపోతున్నారు. బల్లికురవ మండలం ముక్తేశ్వరం గ్రామంలో గత ఏడాది డిసెంబరులో అమృత్ సరోవర్ నీటి కుంట అభివృద్ధి పనులకు గాను రోజుకు 250 మంది చొప్పున కూలీలు పనులకు వచ్చారు. మొదట్లో ఉపాధి అధికారులు కూలీలకు రోజువారీ కూలి పడుతుందని, అందరూ పనులకు రావాలని కోరారు. ఇతర పనులకు వెళ్లినవారిని సైతం ఇక్కడకు రప్పించి పనులు చేయించారు. కూలీలు కూడా గ్రామంలోనే పనులు అందుబాటులో ఉన్నాయని కుంట పనులకు వెళ్లారు. ఉదయం వెళ్లి మధ్యాహ్నం 1 గంట వరకు పనులు చేసిన కూలీలు ఉన్నారు. కానీ అధికారులు కూలీలు రెండు వారాలు పనులు చేసినా వాటికి కొలతలు తీయక పోగా చెల్లింపులకు సంబంధించి ఇంత వరకు ఎలాంటి పేమెంట్ స్లిప్‌లు కూడా ఇవ్వలేదు. రెండునెలలైనా చేసిన పనులకు కూలి డబ్బులు రాకపోవడంతో అధికారుల మాటలు నమ్మి మోసపోయామని సుమారు 2వేల మంది కూలీలు లబోదిబోమంటున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కూలి చెల్లించాలని కోరుతున్నారు.



ముక్తేశ్వరంలో ఉపాధి పనులు చేసిన కూలీలు (ఫైల్)



పనులను తనిఖీ చేసిన అధికారులు (ఫైల్)

పనులను తనిఖీ చేసిన అధికారులు

ముక్తేశ్వరంలో అమృత్ సరోవర్ నీటి కుంట పనులను పథకం క్లస్టర్ ఏపీడీ కోటయ్య నాయక్ సిబ్బందితో కలిసి అప్పట్లో తనిఖీ చేశారు. కూలీలు కుంట పనులు వెంటనే పూర్తి చేయాలని వారికి పలు సూచనలు కూడా చేశారు. ప్రతి రోజు గ్రామంలో ఉండే క్షేత్ర సహాయకుడు వచ్చి పనులు చేయించారని కానీ అధికారులు మాత్రం తమకు రెండు వారాలకు సంబంధించిన కూలి చెల్లింపులు చేయలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

న్యాయం చేయాలి
సింగంశెట్టి ప్రమిలా, ముక్తేశ్వరం



తాను డిసెంబరులో గ్రామంలోని నీటి కుంటలో రెండు వారాలు పనులు చేశాను. నేటికీ కూలి చెల్లించలేదు. ఎవరిని అడిగినా తమకు సరైన సమాధానం చెప్పడం లేదు. అసలు కొలతలే తీయలేదు. తమకు వెంటనే అధికారులు న్యాయం చేయాలి.

పనులు చేసినా కూలి చెల్లించలేదు
నాదెండ్ల వెంకటస్వామి, ముక్తేశ్వరం



గ్రామంలో ఉన్న అమృత్ సరోవర్ కుంట పనులు చేసి రెండు మాసాలు అయింది. నేటికీ కూలి చెల్లించలేదు. సుమారు రెండు వేల మంది వరకు రెండు వారాలపాటు పనులు చేశాం. అధికారులు తనిఖీ కూడా చేశారు. కానీ కూలి డబ్బులు ఇవ్వలేదు.

విచారించి చెల్లిస్తాం
- ఏపీడీ కోటయ్యనాయక్

అమృత్ సరోవర్ నీటి కుంట పనులు చేసిన సమయంలో తాను తనిఖీ చేశాను. కూలీలకు కూలి చెల్లింపులు చేయని విషయం తన దృష్టికి రాలేదు. వెంటనే విచారణ చేసి కూలీలకు రావాల్సిన కూలి వచ్చేలా చర్యలు చేపడతాం.

రిసెప్షన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ముగిసిన తరువాత రిసెప్షన్ కేంద్రానికి ప్రిసైడింగ్ అధికారులు తీసుకువచ్చిన బ్యాలెట్ బాక్స్‌లు, మెటీరియల్‌ని రిసెప్షన్ కేంద్రాలు వద్ద నియమించిన ప్రత్యేక బృందాలు స్ట్రాంగ్ రూంలో సక్రమంగా భద్రపరచాలని రిటర్నింగ్ అధికారి, గుంటూరు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని ఎస్‌ఆర్ శంకరన్ హాల్లో ఎన్నికలకు సంబంధించి పోలింగ్ మెటీరియల్ భద్రపరిచే స్ట్రాంగ్ రూం వద్ద రిసెప్షన్ కేంద్రంలో విధులు కేటాయించిన అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల పోలింగ్ ముగిసిన తరువాత ఏసీ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలలో భద్రపరచటానికి ప్రిసైడింగ్ అధికారులు బ్యాలెట్ బాక్స్‌లు, ఇతర పోలింగ్ మెటీరియల్ రిసెప్షన్ కేంద్రానికి తీసుకువస్తారన్నారు. ప్రిసైడింగ్ అధికారుల నుంచి బ్యాలెట్ బాక్స్‌లు, పోలింగ్ మెటీరియల్, స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ కవర్లు, ఇతర సామగ్రి తీసుకోవటానికి, తీసుకున్న వాటిని స్ట్రాంగ్ రూంలో భద్రపరచటానికి పోలింగ్ బూత్‌ల వారీగా ప్రత్యేకంగా టీంలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఇతర జిల్లాల రిసెప్షన్ కేంద్రాల నుంచి వచ్చిన పోలింగ్ మెటీరియల్ తీసుకోవటానికి, జిల్లాకు ఒక టీంను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. బ్యాలెట్ పేపర్ అకౌంట్, పీవో డిక్లరేషన్, డైరీ, పేపర్ సీల్ అకౌంట్ ఫారాల్లోకి ప్రతి కాలమ్‌ను పరిశీలించి తీసుకోవాలన్నారు. ప్రిసైడింగ్ అధికారుల నుంచి తీసుకున్న మెటీరియల్ ఎప్పటికప్పుడు స్ట్రాంగ్ రూం టీంలతో సమన్వయం చేసుకుంటూ పోలింగ్ బూత్‌లు వారీగా స్ట్రాంగ్ రూంకు తరలించాలన్నారు. అనంతరం రిసెప్షన్ కేంద్రాల వద్ద పోలింగ్ సామగ్రి తీసుకునే అధికారులు పరిశీలించాల్సిన ఫారాలు, వాటి వివరాలను మాస్టర్ ట్రైనర్స్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జేసీ భార్గవతేజ, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, డీటీసీ కె సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

టిడ్కోల్లో.. జీవనోపాధి కేంద్రాలు

తొలిగా మంగళగిరి, చిలకలూరిపేటలో...
రూ. 17.8 కోట్లను సమకూర్చనున్న సీఆర్‌డీఏ, ఉడా

గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశం నడిచి వెళ్లే దూరంలోనే ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) పథకం కింద టిడ్కో భవన సముదాయాల వద్ద జీవనోపాధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో తొలి దశలో మంగళగిరిలోని వీ.పురం-1, చిలకలూరిపేటలోని పురుషోత్తంపట్నం-1, 2టిడ్కో భవన సముదాయాల్లో వీటిని ఏర్పాటు చేస్తారు. వాటిల్లో అన్ని రకాల దుకాణాలు ఏర్పాటు చేయడం ద్వారా టిడ్కో ఫ్లాట్లలో నివాసం ఉంటున్న వారికి స్థానికంగానే ఉపాధి కల్పించడం వీటి లక్ష్యంగా మునిసిపల్ పరిపాలన శాఖ చెబుతున్నది. జీ+3 భవనాలను నిర్మించి వాటిల్లో దుకాణాలను ఏర్పరుస్తారు. ఈ ప్రాజెక్టుని స్థానిక పట్టణాభివృద్ధి సంస్థలతో కలిసి ఏపీ టిడ్కో అమలు చేస్తుంది. వృత్తి నైపుణ్యం, మార్కెటింగ్ మద్దతు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్‌ని మెప్మా పర్యవేక్షిస్తుంది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మంగళగిరిలోని వీ.పురం-1, చిలకలూరిపేటలోని పురుషోత్తంపట్నం-1, 2లో ఇప్పటికే లబ్ధిదారులు నివసిస్తున్నారు. వీ.పురం-1లో 1,728 కుటుంబాలు, పురుషోత్తం పట్నంలో 5,520 కుటుంబాలు నివాసం ఉంటు న్నాయి. దీని దృష్ట్యా వీ.పురం-1లో 35 షాపులను నిర్మించాలని నిర్ణయించారు. 2025 ఫిబ్రవరి - జూన్ మధ్యన 20 దుకాణాలను రూ. 2.4 కోట్లు, జూలై - నవంబరు మధ్యన మరో 15 దుకాణాలను రూ. 1.8 కోట్లతో నిర్మిస్తారు. దీనికి సీఆర్‌డీఏ నిధులు సమ కూర్చాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. పురుషోత్తం పట్నం-1, 2లో తొలి విడతలో 30 దుకాణాలను రూ. 3.6 కోట్లు, రెండో విడతలో 80 దుకాణాలను రూ. 9.6 కోట్లతో స్థానిక పట్టణాభివృద్ధి సంస్థ నిర్మిస్తుంది.



టిడ్కో జీవనోపాధి కేంద్రాలను కేటాయించేందుకు ఔత్సాహిక లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తారు. దరఖాస్తులను పరిశీలన చేసి సోషల్ ఆడిట్ నిర్వహిస్తారు. ఆయా షాపులు కాస్టు-టూ-కాస్టు ప్రాతిపదికన స్వయం సహాయక బృందంలో 2 నుంచి ఐదుగురు సభ్యులకు కేటాయిస్తారు. ప్రతీ చదరపు అడుగుకు రూ. 2 వేల వరకు ధర నిర్ణయిస్తారు. షాపుల ఆపరేషన్, నిర్వహణ ఎస్‌హెచ్‌జీలే చూసుకోవాల్సి ఉంటుంది. బ్యాంకుల నుంచి ఆర్థికసాయం కూడా ఇప్పిస్తారు. ఉత్పాదక కేంద్రాలు, గార్మెంట్ యూనిట్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్, మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ వంటివి ఏర్పాటుకు అనుమతిస్తారు.

అరాచకశక్తులను ప్రోత్సహిస్తున్న జగన్

● పోలీసులపై జగన్ అనుచిత వ్యాఖ్యలను ఖండించిన జీవీ

వినుకొండటౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దుర్మార్గులను సంఘవిద్రోహ శక్తులను ప్రోత్సహించడంతో పాటు పోలీసులపై బాధ్యతారాహిత్యంగా, అవహేళనగా మాట్లాడటాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజా విజయాన్ని ఆకాంక్షిస్తూ పట్టణంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ జగన్‌రెడ్డి ఉద్యోగులతో పాటు పోలీసులపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో నిజాయితీగా పనిచేసిన అధికారులను అవమానించడంతో పాటు ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసి అస్తవ్యస్తమైన పాలన సాగించారన్నారు. కూటమి ప్రభుత్వంలో పోలీసుల గౌరవాన్ని పెంచడంతో పాటు ఉద్యోగులకు సముచిత స్థానం కల్పించి గౌరవించడం జరుగుతుందన్నారు. జగన్ వ్యవహార శైలిని గమనించిన ప్రజలు 11 సీట్లకే పరిమితం చేశారని, అప్పుడే ప్రజలు మీ బట్టలు ఊడదీశారన్న సంగతి జగన్ గుర్తుంచుకోవాలన్నారు. వంశీ ఒక్క మంచిపనైనా చేశాడా అని నిలదీశారు. ఇక పద్ధతి మార్చుకో.. పగటి కలలు కనొద్దు.. ఇప్పటికైనా మారాలంటూ జగన్‌కు హితవు పలికారు. మిమ్మల్ని నమ్మిన విశాల్ గున్ని, ఆంజనేయులు నటి జత్వానీ కేసులో జైలుకు వెళ్లాల్సివచ్చిందని, ట్రిపుల్ ఆర్‌ను ఇబ్బందిపెట్టిన వారంతా నేడు జైలుబాట పడుతున్నారని, దుర్మార్గులకు శిక్ష పడటం ఖాయమని చెప్పారు. పోలీస్ వ్యవస్థను మెచ్చుకుంటున్నారని, ఎక్కడైనా గుట్కాలు, గంజాయిలు కనిపిస్తున్నాయా అని అన్నారు.

జగన్ రాష్ట్రాన్ని విడిచి వెళ్ళటం ఖాయం

● ఎమ్మెల్యే పుల్లారావు

నాదెండ్ల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలుచేయగానే జగన్ రాష్ట్రాన్ని విడిచి వెళ్ళటం ఖాయమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని సాతులూరులో క్లస్టర్, బూత్ ఇన్‌చార్జ్‌లతో పట్టభద్రుల ఎంఎల్‌సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌సీ ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వ ఎనిమిది నెలల పని తీరుకు ప్రామాణికమనే వాస్తవాన్ని అందరూ గుర్తించాలన్నారు. బలంగా ఉన్న ప్రజాప్రభుత్వాన్ని బలహీన పరిచేందుకు జగన్‌తో పాటు ఆయన అవినీతి మీడియా అసత్యాలు ప్రచారం చేస్తున్నాయన్నారు. అధికారులను బెదిరిస్తూ వారిని అగౌరవపరిచేలా మాట్లాడిన జగన్ వ్యాఖ్యలు చేతగానితనానికి నిదర్శనం అన్నారు. ఎంఎల్‌సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్ర ప్రసాదును మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎన్నికల పరిశీలకుడు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, జనసేన నాయకులు మార్కెండేయులు, తోట రాజారమేష్ పాల్గొన్నారు.

ఏఐతో రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి శ్రీకారం

● పట్టభద్రులు బాధ్యతతో ఓటు వేసి ఆలపాటిని గెలిపించాలి ● మంత్రి పార్థసారథి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి, వేదికపై మంత్రి గొట్టిపాటి రవి, ఎమ్మెల్యే ఆనందబాబు తదితరులు

కొల్లూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌తో రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారని రాష్ట్ర గృహనిర్మాణ శాఖామంత్రి, జిల్లా ఇన్‌చార్జి కొలుసు పార్థసారధి పేర్కొన్నారు. బుధవారం కొల్లూరులోని ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్‌లో కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోసం ఏర్పాటు చేసిన పట్టభద్రుల సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా మాట్లాడారు. గత ఐదేళ్లలో జగన్మోహనరెడ్డి ఆరాచకాలు, అకృత్యాలు అనుభవించిన రాష్ట్ర ప్రజలు గత ఎన్నికల్లో ఛీకొట్టినా ఆయన ఆలోచన మారలేదన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం పాలన చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. కొడాలి నాని, వల్లభనేని వంశీలతో జగన్ సిగ్గుమాలిన రాజకీయాలు చేయడం తలవంపులు తెస్తున్నదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటికి ఉద్యోగులు, పట్టభద్రులు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. విద్యాశాఖ మంత్రి గొట్టిపాటి రవి మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అథోగతిలోకి నెట్టినా సీఎం చంద్రబాబు అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటిని అందరూ ఐక్యతతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ, ఆలపాటి గెలుపు ఏకపక్షంగా ఉండాలని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వ్యవస్థలను గాడినపెడుతూ అభివృద్ధి పథంలోకి తీసుకువెళుతున్నారన్నారు. సమావేశంలో ముస్లిం, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తక్ అహ్మద్, వంగా సాంబిరెడ్డి, జనసేన సమన్వయకర్త ఊసా రాజేష్, టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, జనసేన మండల అధ్యక్షుడు బొందలపాటి చలమయ్య, బీజేపీ నాయకుడు మందా జనార్ధన్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శరత్ చంద్ర, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కిడ్నాప్.. హత్యాయత్నం కేసులో నలుగురు నిందితుల అరెస్టు

● పరారీలో మరొకరు



కిడ్నాప్ కేసులో నిందితుల వివరాలను తెలుపుతున్న సీఐ రమేష్‌బాబు, ఎస్సై ప్రకాష్‌రావు తదితరులు

తెనాలి మారీసుపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జీతం డబ్బులిస్తానంటూ కిడ్నాప్ చేసి దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన కేసును పోలీసులు ఛేదించారు. బుధవారం స్థానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో నిందితులను విలేకరుల ముందు హాజరుపరిచి వివరాలను సీఐ రమేష్‌బాబు వెల్లడించారు. కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన జానా సతీష్ హైదరాబాద్‌లో తెనాలిలోని నందులపేటకు చెందిన అన్నే మణిదీప్‌కు చెందిన ఓ కార్యాలయంలో ఆఫీస్‌బాయ్‌గా చేరాడు. జీతం చెల్లింపులో జాప్యం జరగడంతో యజమాని మణిదీప్‌ను పలుమార్లు సతీష్ ప్రశ్నించాడు. తన జీతం తనకు ఇవ్వాలంటూ పట్టుబట్టడంతో ఈ నెల 14న తెనాలి వస్తే జీతం డబ్బు ఇస్తానని మణిదీప్, సతీష్‌కి చెప్పాడు. దీనితో సతీష్ తన స్నేహితుడు ధరణికోట ప్రశాంత్ అలియాస్ పండుతో తెనాలి వచ్చాడు. వారి ఇరువురిని మణిదీప్ అతని మిత్రులు ఉప్పు రంగారావు, పెనుమూరి ఆదాం, కోట ప్రేమ్‌చందు, బచ్చల రమేష్‌బాబులు ఐదుగురు కలసి బలవంతంగా కారులో ఎక్కించుకొని సుల్తానాబాద్‌లోని ఒక గదిలో బంధించారు. అనంతరం వారిపై విచక్షణారహితంగా దాడి చేసి కరెంటు షాక్‌కు గురిచేశారు. అనంతరం సతీష్, ప్రశాంత్‌లను శివారు ప్రాంతాల్లో చంపేందుకు కారులో తీసుకొని వెళుతుండగా వారి నుంచి తప్పించుకున్న సతీష్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం నందివెలుగు వద్ద నిందితుల్లో నలుగురిని అదుపులోకి తీసుకోగా మరొకరు పరారీలో ఉన్నట్లు చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తున్నట్లు సీఐ వివరించారు. కార్యక్రమంలో ఎస్సై ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో కిడ్నాప్ కేసు నిందితుడు?

తెనాలి మారీసుపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అప్పు అడిగితే ఇవ్వలేదని బలవంతంగా కారులో ఎక్కించుకొని కిడ్నాప్ చేసి విచక్షణారహితంగా కారులోనే కుళ్లబొడిచి కొట్టి పడివేసిన ఘటనలో నిందితుడు వైసీసీ కౌన్సిలర్ మొగల్ అహ్మద్‌బేగ్ పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం. ఈ నెల 5వ తేదీన సాయంత్రం వార్ఫ్ రోడ్డులో కోతమిషన్ వద్ద నిలబడి ఉన్న కార్పెంటర్ షేక్ మస్తాన్‌వలిని నెంబర్ ప్లేట్ లేని కారులో వైసీపీ కౌన్సిలర్ మొగల్ అహ్మద్ బేగ్, మరో ముగ్గురు వచ్చి బలవంతంగా ఎక్కించుకొని తక్కెళ్లపాడు, అక్కడ నుండి విజయవాడ దారి పొడవునా కొట్టుకుంటూ తీసికువెళ్లారు. మస్తాన్‌వలిని చంపుతామని బెదిరించారు. ఇబ్రహీంపట్నం తీసుకెళ్లి అక్కడ నుంచి తెనాలి తీసుకొచ్చి కౌన్సిలర్ ఇంటి వద్ద వదిలేసి వెళ్లారు. ఈ ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడి అరెస్ట్‌పై పూర్తి వివరాలు పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

గుంటూరు మీదుగా దానాపూర్‌కు 9 ప్రత్యేక రైలు సర్వీసులు

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా తొమ్మిదిరోజుల పాటు గుంటూరు మీదుగా దానాపూర్‌కు తొమ్మిది ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 07791 చర్లపల్లి - దానాపూర్ ప్రత్యేక రైలు ఈ నెల 20వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిత్యం ఉదయం 9.30కి బయలుదేరి మధ్యాహ్నం 12.18కి పిడుగురాళ్ల, 2 గంటలకు గుంటూరుకు చేరుకొంటుంది. అనంతరం విజయవాడ - విజయనగరం మార్గంలో ప్రయాణించి రెండో రోజు అర్ధరాత్రి దాటాక 1.30కి దానాపూర్ చేరుతుందన్నారు. నంబరు 07792 దానాపూర్ - చర్లపల్లి స్పెషల్ రైలు ఈ నెల 20వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిత్యం వేకువజామున 4.45కి బయలుదేరి మధ్యాహ్నం 2.50కి గుంటూరు, సాయంత్రం 4.18కి పిడుగురాళ్ల, రాత్రి 9.30కి చర్లపల్లి చేరుకొంటుందన్నారు.


బుల్లెట్ బ్యాక్‌ఫైర్ అవటంతో ఆర్మీ జవాన్ మృతి



పరిశా వెంకటేష్ (ఫైల్)

పిట్లలవానిపాలెం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో ఫీల్డ్‌ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా బుల్లెట్ బ్యాక్ ఫైర్ అవటంతో బాపట్ల జిల్లా పిట్లలవానిపాలెం పంచాయతీ పరిధిలోని గౌడపాలెం గ్రామానికి చెందిన పరిశా వెంకటేష్(26) మృతి చెందారు. ఢిల్లీ ఆర్‌ఆర్ హాస్పటల్ నుంచి పార్థివదేహాన్ని హెలీకాప్టర్‌లో స్వగ్రామానికి తీసుకొస్తారని సమాచారం. పరిశా శ్రీనివాసరావు, శివపార్వతి దంపతులకు ఇద్దరు కుమారులు. వారిలో వెంకటేష్ పెద్దవాడు. 2022లో వెంకటేష్‌కు వివాహమైంది. అతనికి భార్య పరిశా గాయత్రి, కుమార్తె జ్యోత్స్న ఉన్నారు. వెంకటేష్ తమ్ముడు పరిశా గోపికృష్ణ ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నాడు. మృతుడు వెంకటేష్ ఉద్యోగరీత్యా తొలుత మహారాష్ట్ర, సిక్కింలలో విధులు నిర్వహించి ప్రస్తుతం పంజాబ్‌లో పని చేస్తున్నారు. రాజస్థాన్‌లో ఫీల్డ్‌ఫైరింగ్ ప్రాక్టీస్ చేసేందుకు వెంకటేష్ బెటాలియన్‌తో అక్కడకు వెళ్ళాడు. ప్రాక్టీస్‌లో ఉండగా బుల్లెట్ బ్యాక్ ఫైర్ కావటంతో వెంకటేష్ మృతి చెందాడు. పార్థివదేహాన్ని స్వగ్రామం తెచ్చేందుకు సమయం పడుతుందని కుటుంబసభ్యులు తెలిపారు. పిట్లలవానిపాలెం తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ కె.శ్రీనివాసరావు, చందోలు ఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్‌లు బుధవారం మృతుని స్వగ్రామానికి వెళ్ళి కుటుంబసభ్యులను పరామర్శించారు.


రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడి మృతి



గుర్తు తెలియని మృతదేహం

రాజుపాలెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైలులో నుంచి జారిపడి గుర్తుతెలియని యువకుడు(30) మృతి చెందిన సంఘటన గుంటూరు-సికింద్రాబాద్ రైలుమార్గంలోని రాజుపాలెం-రెడ్డిగూడెం గ్రామాల మధ్య మంగళవారం రాత్రి జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు... సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్తున్న రైలు నుంచి యువకుడు జారిపడినట్లు తెలిపారు. మృతి చెందిన యువకుడు సుమారు 5.3 అడుగుల ఎత్తు, ఏరుపు రంగు చాయ, తెలుపు షర్టు, బ్లూప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి పడి వలసకూలీ మృతి



నాగేష్ (ఫైల్‌ఫొటో)

క్రోసూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రమాద వశాత్తు ట్రాక్టర్‌పైనుంచి పడి హెచ్ నాగేష్(28) అనే వలసకూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని బాలెమర్రులో బుధవారం జరిగింది. మృతుడిది కర్నూలు జిల్లా మంత్రాలయం వద్ద సులకేర గ్రామంగా స్థానికులు తెలిపారు. రెండు నెలల క్రితం మిర్చికోతల కోసం బాలెమర్రు గ్రామానికి ఇతర కూలీలతో కలసివచ్చాడని, బుధవారం ఉదయం బాలెమర్రు నుంచి ట్రాక్టర్ పుట్ రెస్ట్‌పై నిలబడి పొలాలకు వెళ్తుండగా ప్రమాద వశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం క్రోసూరు తీసుకువస్తుండగా మార్గమధ్యంలో మరణించినట్టు స్థానికులు తెలిపారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. క్రోసూరు ఎస్ఐ నాగేందరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కాకినాడ జేఎన్‌టీయూ వీసీగా అమృతలూరు వాసి

అమృతలూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్‌టీయూ వీసీగా అమృతలూరు వాసి నియామకం అవడం పట్ల గ్రామస్తులు హర్షం వెలిబుచ్చారు. గ్రామానికి చెందిన మధ్య తరగతి కుటుంబానికి చెందిన చేకూరి సాంబశివరావు, వెంకటసుబ్బమ్మ దంపతుల ప్రథమ కుమారుడే చేకూరి శివరామకృష్ణ ప్రసాద్. ప్రస్తుతం ఎన్ఐటీ వరంగల్‌లో సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. చిన్నతనం నుంచి చదువులో ముందు ఉండేవాడని, గ్రంథాలయంలో పుస్తక పఠనం ఎక్కువగా చేసేవాడని గ్రామస్తులు గుర్తుచేసుకున్నారు.

ఒక్క చాన్స్‌తో జగన్ అధ్యాయం ముగిసింది

● మళ్లీ సీఎం అవుతాడనేది భ్రమ
● 3000 సార్లు బెయిల్ తీసుకున్నాడు
● ఏ క్షణంలోనైనా జైలుకు పోవచ్చు
● కేంద్ర మాజీమంత్రి చింతా మోహన్



మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తండ్రి మరణంతో వచ్చిన సానుభూతితో పాదయాత్ర ద్వారా ఒక్క చాన్స్ ఇవ్వాలని ప్రజలను ప్రాధేయపడడంతో ప్రజలు చాన్స్ ఇచ్చారని, ఆ చాన్స్‌తోనే జగన్ రాజకీయ అధ్యాయం ముగిసిందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. మంగళగిరి ఐబీఎన్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియా తో మాట్లాడారు. వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తుందని, తాను మళ్లీ సీఎం అవుతానని జగన్ భ్రమ పడుతున్నారని విమర్శించారు. ఇప్పటివరకు మూడువేల సార్లు బెయిల్ తీసుకున్న జగన్ ఏ క్షణంలోనైనా జైలుకు పోవచ్చని అభిప్రాయపడ్డారు. బట్టలూడదీస్తానంటూ పోలీసు అధికారులను ఉద్దేశించి జగన్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ప్రజాక్షేత్రంలో ఉన్నప్పుడు భాష జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జగన్ పాలన దెబ్బ కు భయపడిపోయిన ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని, నేడు కూటమి ప్రభుత్వం పేదలను పట్టించుకోకుండా కోటీశ్వరుల పరమైందని విమర్శించారు. సీఆర్‌డీఏ పనుల్లో బడా కాంట్రాక్టర్లకే అవకాశాలు ఇస్తున్నారని, ఎస్సీ, ఓబీసీలకు కూడా కాంట్రాక్టు పనులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాతీయ బ్యాంకులు, దేశ సంపదలో వర్గీకరణ జరగాలన్నారు. 25 శాతం జనాభాగా ఉన్న ఎస్సీ, ఎస్టీలకు బ్యాంకు అప్పుల్లో కేవలం ఒక్క శాతం, 50 శాతానికి పైగా వున్న బీసీలకు కేవలం 2 శాతం లోపు మాత్రమే రుణాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని, బీజేపీ దేవుడ్ని అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తుందని ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రభుత్వం వెనుకబడిన ప్రాంతాలను పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ను సమానంగా అభివృద్ధి చేయాలని, ఎస్సీ ఎస్టీ, బీసీల సంక్షేమానికి చిత్తశుద్ధితో పని చేయాలని మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు.

ఐకమత్యానికి కళలు దోహదం

● ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ కుమార్

పెదకాకాని, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఐకమత్యాన్ని, చైతన్యాన్ని కళలు ఎప్పుడూ ఆకాంక్షిస్తాయని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్ అన్నారు. విశ్వవిద్యాలయంలోని నృత్య విభాగం ఆధ్వర్యంలో బుధవారం లెక్చర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ హాజరయ్యారు.కళల్లో ప్రత్యేకమైనవి నాట్యమన్నారు. కుల, మత, ప్రాంత, భాషలకు అతీతంగా అందరూ నాట్యశాస్త్రాన్ని అధ్యయనం చేసి సమున్నత వ్యక్తులుగా ఎదగాలని సూచించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న పీజీ ప్రవేశాల డైరెక్టర్, విద్యావిభాగాధిపతి ఆచార్య పి.బ్రహ్మాజీరావు మాట్లాడుతూ నాట్యశాస్త్రం నేటి ఆధునాతన సైన్స్ వంటిదని, ఈ శాస్త్రాన్ని మరింత ప్రాచుర్యంలోకి తేవాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రధానవక్తగా డాక్టర్ కె.దేవేంద్ర పిళ్ళై మాట్లాడుతూ సబీర్‌గా మొదట ఆరంభమైన ఈ నాట్యం క్రమక్రమంగా భరతనాట్యంగా పరిణతి చెందిందని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ నాట్యశాస్త్ర వికాసం, నృత్య, నాట్య మూలభేదాన్ని, వివిధ నాట్య సంప్రదాయాల్ని, నాట్యశాస్త్ర అంశాలను, కాలానుగుణంగా వస్తున్న మార్పులను వివరించారు. వివిధ రాజుల పాలనలో నాట్యం స్థితిగతులను సాహిత్య, చారిత్రక విశేషాలతో మేళవించి ప్రదర్శన పూర్వకంగా ప్రసంగించారు. నాట్యంవలన కలిగే శారీరక, మానసిక ప్రయోజనాలను తెలిపారు. నేటి యువత ఉత్సాహంగా ఈ కోర్సును అభ్యసించాలని సూచించారు. విభాగాధిపతి ఆచార్య పి.వరప్రసాద్ మూర్తి విభాగ పురోగతిని వివరించారు. కార్యక్రమంలో విభాగం అతిధి అధ్యాపకులు డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

బొల్లాకు వ్యతిరేకంగా సజ్జలను కలిసిన అసమ్మతి నేతలు



బొల్లాకు వ్యతిరేకంగా సజ్జల రామకృష్ణారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న వినుకొండ వైసీపీ నేతలు

వినుకొండటౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వినుకొండ వైసీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు వ్యతిరేకంగా నియోజకవర్గంలోని వైసీపీ అసమ్మతి నేతలు తాడేపల్లి ప్యాలెస్‌లో సజ్జల రామకృష్ణారెడ్డిని బుధవారం కలిసి ఫిర్యాదుచేశారు. బొల్లా వ్యవహారశైలిపై వారంతా సజ్జల వద్ద అసంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఆయన నోటిదూల కారణంగా వినుకొండలో పార్టీ మనుగడ కోల్పోతోందని, స్థానిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కొత్త ఇన్‌చార్జిని నియమించాలంటూ సజ్జలను కోరారు. మిమ్మల్నే కాదు.. మమ్మల్ని కూడా బొల్లా తిడతారని ఆయన గురించి అసమ్మతి నేతలకు సజ్జల వివరించినట్లు సమాచారం. త్వరలో క్షేత్రస్థాయిలో నివేదికల ద్వారా న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఇక నుంచి చుండూరి వెంకటేశ్వర్లు నాయకత్వంలో మేమంతా కలిసికట్టుగా పనిచేస్తామని బొల్లా నాయకత్వంలో పనిచేయబోమని తెగేసి చెప్పినట్లు వివరించారు. సజ్జలను కలిసిన వారిలో జడ్పీ కోఆప్షన్ మెంబరు గూండాల స్వెనోమ్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, నూజెండ్ల మండల వైసీపీ అధ్యక్షుడు నక్కా నాగిరెడ్డి, ఈపూరుకు చెందిన వైసీపీ నాయకులు హనుమయ్య, బుచ్చయ్య, అవినాష్‌రెడ్డి, నరాలశెట్టి శ్రీనివాసరావు, ఇమామ్‌సా, కొత్త కృష్ణారెడ్డి, మరో వందమంది కార్యకర్తలు ఉన్నారు.

జిందాల్ ప్లాంటును సందర్శించిన ఐజీ రవికృష్ణ బృందం

● పట్టుబడిన 4 టన్నుల గంజాయిని ఈ నెల 22న దహనం చేయనున్నట్లు వెల్లడి



జిందాల్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎంవీ చారితో సమావేశమైన ఐజీ రవికృష్ణ, పోలీసు ఉన్నతాధికారుల బృందం

యడ్లపాడు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండల పరిధిలోని జిందాల్ అర్బన్ వేస్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ ప్లాంటును ఐజీ రవికృష్ణ ఆధ్వర్యంలోని పోలీసు ఉన్నతాధికారుల బృందం బుధవారం సందర్శించింది. ప్లాంటు కార్యనిర్వాహక అధ్యక్షుడు(ఆపరేషన్స్) ఎంవీ చారితో బృందం సమావేశమైంది. ఇటీవల కృష్ణాజిల్లాలో పట్టుబడిన సుమారు 4 టన్నుల గంజాయిని దహనం చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకున్నామన్నారు. పట్టుబడిన గంజాయిని ఈ నెల 22న తగులబెట్టేందుకు నిర్ణయించామని, అందుకు ప్లాంటులో తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించేందుకు డీజీపీ హరీష్ కుమార్‌గుప్తాతోపాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు హాజరవుతారని తెలిపారు. అనంతరం ప్లాంటులోని అన్ని విభాగాలను పరిశీలించారు. వ్యర్థాల సేకరణ, వాటిని దహనంచేసి విద్యుదుత్పత్తి చేస్తున్న తీరును తెలుసుకున్నారు. ఐజీ వెంట ఎన్టీఆర్ కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధర్, ఈగిల్ ఎస్పీ కె.నగేష్‌బాబు, గన్నవరం డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు, పెనమలూరు సీఐ వెంకటరమణ, చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్సై బాలకృష్ణ ఉన్నారు.

కోల్డ్ స్టోరేజ్ అసోసియేషన్ అధ్యక్షుడు తడికమళ్ల కన్నుమూత



తడికమళ్ల సూర్య ప్రకాశరావు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కోల్డ్ స్టోరేజ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తడికమళ్ల సూర్యప్రకాశ రావు బుధవారం కన్నుమూశారు. గత ముప్పై సంవత్సరాలుగా ఆయన గుంటూరు జిల్లా కోల్డ్ స్టోరేజ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడుగా కొనసాగుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫెడరేషన్ ఆఫ్ కోల్డ్ స్టోరేజ్ వైస్ ప్రెసిడెంట్‌గా, గుంటూరు చాంబర్ ఆఫ్ కామర్స్ వైస్‌ప్రెసిడెంట్‌గా కూడా పనిచేశారు. రైతులకు అందుబాటులో ఉండే ప్రాంతంలో కోల్డ్‌స్టోరేజ్‌లు నిర్మించి, వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించటం లో సూర్యప్రకాశరావు ఎప్పుడూ ముందుండేవారని అసోసియేషన్ కార్యదర్శి పి.సురేంద్రబాబు అన్నారు. ఆయన లేనిలోటు పూడ్చలేనిదని అసోసియేషన్ కోశాధికారి ఆర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సూర్యప్రకాశ రావు అంత్యక్రియలు గురువారం నిర్వహించనున్నట్టు వారు వెల్లడించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	87, 99,108
చికెన్ విత్ స్కిన్	172.00
చికెన్ స్కిన్ లెస్	182.00

1,42,943 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,47,414 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,42,943 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 75,790 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	13700
నంబరు. 5	10000	14000
273	10200	13000
341	10000	14000
4884	10000	12200
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13900
బ్యాడిగి	10000	13500
దేవనూరుడీలక్స్	10000	13300
తాలుకాయలు	4000	7000

బాపట్ల వార్తలు

రైతులు తమ పేర్లను సీఎంఏపీపీలో నమోదు చేసుకోవాలి

బాపట్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఈక్రాప్‌లో కందుల పంటను నమోదు చేసుకున్న రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాల వద్ద అమ్మదలిచిన యెడల తమ సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రాల వద్ద కెళ్ళి తమ పేర్లను సీఎం ఏపీపీలో గురువారం నుంచి నమోదు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1099 హెక్టార్‌లలో రైతులు కందిని సాగు చేసియున్నారని తెలిపారు. సుమారుగా 2200 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనావేయటం జరిగిందన్నారు. ఈ కందిపంట అద్దంకి, సంతమాగులూరు, బల్లికురవ, మార్టూరు మొదలుగు మండలాలలో 69 రైతు సేవా కేంద్రాలలో విస్తరించియున్నదన్నారు. ప్రతిరైతు సేవా కేంద్రం ఒక కొనుగోలు కేంద్రంగా భావించి 5 ప్రధమ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయటం జరుగుతుందన్నారు. రైతుల వద్ద నుంచి కందుల పంటను వారి రైతు సేవా కేంద్రాల పరిధిలోనే ఎం.ఎస్‌పి ధరపై క్వింటాలకు రూ.7,550 మద్దతు ధర చొప్పున మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయుటకు నిర్ణయించటం జరిగిందన్నారు. కొనుగోలు చేసిన కందులను రైతు సేవా కేంద్రాలు నుంచి మార్క్‌ఫెడ్ వారు నిర్ణయించిన వాహనాల ద్వారా ఎస్‌డబ్ల్యుసి గిడ్డంగులకు చేరవేయటం జరుగుతుందని తెలిపారు. వివరాలకు రైతు సేవా కేంద్రాల వద్ద సంప్రదించాలన్నారు.

ఆర్మీ జవాన్ మృతి బాధాకరం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పిట్టలవానిపాలెం గ్రామపంచాయతీలోని గౌడపాలెం గ్రామానికి చెందిన ఆర్మీఉద్యోగి పరిశా వెంకటేష్ రాజస్థాన్ ఫీల్డ్‌ఫైరింగ్ ప్రాక్టీస్ బూలెట్ బ్యాక్ ఫైర్ అవ్వటం కారణంతో మృతి చెందటం ఎంతో బాధాకరమని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మృతుని స్వగ్రామానికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశా వెంకటేష్ దేశ సేవలో అంకితమై పనిచేయటం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. రాజస్థాన్‌లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ విధినిర్వాహణలో అనుకొని సంఘటనలో మృత్యువాతపడటం వారి కుటుంబానికి తీరనిలోటు అన్నారు. వెంకటేష్ సోదరుడు పరిశా గోపి కృష్ణ కూడా ఆర్మీలో పనిచేస్తూ దేవ సేవకు పునరంకితమయ్యారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ వెంకటేష్ మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు తీవ్రతమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మృతుడు వెంకటేష్ తండ్రి శ్రీనివాసరావు కూలి పనిచేస్తుంటారు. ఆకుటుంబానికి ప్రభుత్వం అన్నివిధాలాగా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొలగాని నారాయణ, లక్ష్మంరాజు వెంకటపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనిక ఉద్యోగి మృతికి నివాళి

చుండూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండూరుకు చెందిన మాజీ సైనిక ఉద్యోగి రెడ్డి శ్రీనివాసరావు మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఆయన మృతికి గ్రామస్థులు, జిల్లా సైనిక అధికారులు, మాజీ సైనిక సిబ్బంది మృతదేహంపై జాతీయ జెండాను ఉంచి నివాళులర్పించారు. 1996 నుంచి 2019 వరకు వివిధ హోదాలలో పని చేసిన ఆయన పదవీ విరమణ అనంతరం గ్రామంలో పేద విద్యార్థుల అభివృద్ధికి, గ్రామాభివృద్ధికి కృషి చేశారు.

గుళ్ళపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో హిందీ భాషోత్సవం

చెరుకుపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం బుధవారం హిందీ భాషోత్సవం గుళ్ళపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పిల్లలకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహించారు. కథలు చెప్పడం, పద్యాలు, బాల గేయాలు, బోధనా పరికరాల ప్రదర్శన, పాటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను హిందీ ఉపాధ్యాయులు ఎ.మాధవి, టి.అనుపమ, పర్యవేక్షించారు. ప్రధానోపాధ్యాయురాలు కె.కవిత మాట్లాడుతూ అందరూ హిందీ భాష నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ నాంచారయ్య, ఉపాధ్యాయులు వి.శ్రీను, జక్రయ్య, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పన్ను వసూలుపై అభినందన

అమృతలూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్ను నూరుశాతం వసూలు చేయడంతో మండలంలోని కూచిపూడి పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి తిరుమలరావును డీజీపీవో ప్రభాకరరావు బుధవారం అభినందించారు. అమృతలూరు మండల పరిషత్ కార్యాలయానికి విచ్చేసిన ఆయన ఇంటి పన్ను వసూలును పరిశీలించారు. నూరుశాతం ఇంటి పన్ను కూచిపూడి పంచాయతీ వసూలు చేసి ఉండటంతో ఆయన తిరుమలరావును ప్రత్యేకంగా అభినందించారు.

వీధి ఆవులకు వైద్య సేవలు

బాపట్ల,ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : నిత్యం పట్టణ వీధులలో సంచరిస్తున్న ఆవులను 3వవార్డు హిందూ శ్మశాన వాటిక ప్రాంగణంలోకి తరలించి మున్సిపల్ అధికారులు సంరక్షిస్తున్నారు. అక్కడ ఉన్న ఆవులకు కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైద్యసేవలందించారు. ఎలాంటి వ్యాధుల బారిన పడకుండా ఇంజక్షన్‌లిచ్చి వాటిని సంరక్షించే ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, సంరక్షకులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి : ఎంఈవో

కర్లపాలెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న చిన్నారులందరికి నాణ్యవంతమైన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంఈవో టీయూ మనోరంజని నిర్వాహకులకు సూచించారు. బుధవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి అనంతరం పాఠశాలలోని రికార్డులను తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇనకొల్లు పోలీసురావు, ఎం.ఇందుమతి, డీఎల్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం

● విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



బాపట్లలో ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

బాపట్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రాధాన్యతను ఈ రాష్ట్రప్రభుత్వం ఇస్తున్నదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్థిక పరిస్థితులను చిన్నాభిన్నం చేసి వెళ్ళారన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల, గృహనిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వం సహకారంతో దాదాపు 90 స్కీమ్స్‌ను శాంక్షన్ చేస్తే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇచ్చే వాటా ఇవ్వలేక వాటిన్నిటిని కూడా గాలికి వదిలేసిన దౌర్భగ్య పరిస్థితి వైసీపీ ప్రభుత్వంలో చూడటం జరిగిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆస్కీమ్‌లలోని 72స్కీమ్‌లను మళ్ళీ రివైజ్ చేయటమే కాకుండా రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని గాడిలో పెట్టటానికి పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకురావటం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికలలో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి మొదటి ప్రాధాన్యతనిచ్చి ఓటు వేయాలన్నారు. రాబోయే రోజుల్లో గ్రాడ్యుయేట్స్ సమస్యలపై చట్ట సభలలో అభ్యర్థించే వ్యక్తి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరి మానం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు రూపానందరెడ్డి, బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబిరెడ్డి, బాపుడా చైర్మన్ సలగల రాజశేఖరబాబు, బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, ఆప్కో చైర్మన్ సజ్జా హేమలత, టీడీపీ నాయకులు చీరాల గోవర్ధనరెడ్డి, బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు బాలనారాయణ, శ్రీరామయ్య, కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించండి

రేపల్లె, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించాలని విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బుధవారం స్థానిక వీరవల్లి కోటయ్య ఫంక్షన్‌హాలులో కూటమి అభ్యర్థి ఆలపాటిరాజేంద్రప్రసాద్ గెలుపు కోసం నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి రాజాకు మద్దతుగా ప్రతి ఒక్కరూ నిలవాలని గతంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా విధులు నిర్వహించి తీరప్రాంత అభివృద్ధికి కృషిచేశారన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పనిచేసి రాష్ట్రాభివృద్ధిలో కీలక బాధ్యతలు చేపట్టి ప్రజలకు సేవలు అందించిన వ్యక్తి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, కృష్ణా, పశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, అనగాని శివప్రసాద్, గూడపాటి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరరావు, కొల్లూరు మాజీ ఎంపీపీ డాక్టర్ మధుసూదన్‌రావు, రేపల్లె రామాంజనేయులు, ఓగిబోయిన వెంకట్‌యాదవ్, బీజేపీ నాయకులు మాణిక్యారావు తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరులో మంత్రుల ప్రచారం

కొల్లూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తరుపున రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారధి, గొట్టిపాటి రవికుమార్‌లు ప్రచారం నిర్వహించారు. బుధవారం కొల్లూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత, బాలురోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలుసుకుని ఆలపాటికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గుర్రం మురళీమోహన్, ఉద్యోగులు రాష్ట్ర మంత్రులను కలిసి గత ప్రభుత్వంలో సీపీఎస్ ఉద్యోగులపై కేసులను ఎత్తి వేసేందుకు కృషి చేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులతోపాటు సీపీఎస్ ఉద్యోగులు ఎస్టేట్‌బాబు, శ్రీనివాస్, మనోజ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆనందబాబు ప్రచారం

భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను పట్టభద్రులంతా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రచారం నిర్వహించారు. బుధవారం భట్టిప్రోలులోని విశ్వశాంతి విద్యా సంస్థ, టీఎం రావు ఉన్నత పాఠశాల కెఎస్‌కె జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఎమ్మెల్యే కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటికి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఒక్కొక్కరు 20 మంది పట్టభద్రుల ఓటర్లను పోలింగ్ బూత్‌లకు తీసుకువచ్చే బాధ్యత తీసుకోవడంతో పాటు మొదటి ప్రాధాన్యత ఓటు వేసే విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. టీడీపీ నాయకులు తూనుగుంట్ల సాయిబాబా, ఎన్నికల పరిశీలకులు వంగా సాంబిరెడ్డి, ఉద్యోగులు, పట్టభద్రులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చుండూరు మండలంలో..

చుండూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయం కోరుతూ మండలంలోని మండూరు, చినపరిమి, ఆలపాడు, చుండూరు, మోదుకూరు ఆయా గ్రామాల కూటమి నాయకులు ఓటర్లను కలిసి ప్రచారం చేశారు. కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమాల్లో పార్టీ సీనియర్ నాయకులు విఎస్‌కె ప్రసాద్, దేవిరెడ్డి నాగేశ్వరరావు, జొన్నకూటి సాంబశివరావు, శ్రీనివాసరావు, ఉరిటి అశోక్, మస్తాన్, చక్కా బుచ్చయ్య, కిరణ్, యానం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



గృహనిర్మాణాలపై సమావేశంలో సూచనలు చేస్తున్న జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్

గృహ నిర్మాణాలలో లక్ష్యాలను చేరుకోవాలి : జేసీ

బాపట్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పక్కా గృహాల నిర్మాణాలలో ప్రభుత్వం లక్ష్యాలను చేరుకోవటానికి అధికారులు కృషి చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్ అన్నారు. గృహ నిర్మాణాలపై సంబంధితశాఖాధికారులతో బుధవారం ఆయన స్థానిక కలెక్టరేట్‌లో సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ పక్కా గృహాల నిర్మాణ లక్ష్యాలలో పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. మొదటి త్రైమాసంలో జిల్లాకు 4,898 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యమన్నారు. ప్రస్తుతం 290 మాత్రమే పూర్తి చేయటంపై అసహనం వ్యక్తం చేశారు. మిగిలినవన్ని మార్చిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద గృహ నిర్మాణాలలో పని దినాలు కల్పించాలన్నారు. నిర్దేశించిన మాదిరిగా 90 పని దినాలు చూపి లబ్ధిదారులకు కూలి సొమ్ము చెల్లించాలన్నారు. ఇందులో భాగంగా కేంద్రప్రభుత్వ మార్గదర్శకాల మేరకు వ్యక్తిగత మరుగుదొడ్లు ప్రతి ఇంటికి ఉండాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన లబ్ధిదారులకు ఇల్లు నిర్మించి ఇవ్వటానికి స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా ఇల్లు నిర్మించటానికి చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలు జరిగిన కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించటానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గృహనిర్మాణశాఖాధికారి వెంకటేశ్వర్లు, ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యాబోధన చేయాలి

● బాపట్ల సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం.నాగిరెడ్డి

బాపట్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబోధన చేయాలని డిప్యూటీ కలెక్టర్, బాపట్ల సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం.నాగిరెడ్డి అన్నారు. స్థానిక సమగ్రశిక్ష కార్యాలయంలో టీచ్‌టూల్ బాపట్ల పరిధిలోని టీచ్‌టూల్ అబ్జర్వర్స్ సమీక్షా సమావేశంలో బుధవారం ఆయన పాల్గొని పలుసూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ప్రేరణతో కూడిన అభ్యాసన కార్యక్రమాలు ఉంటాయని శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, సీఆర్ఎంటియు, పీటీఐలు ఉంటారని వీరి ద్వారా నాణ్యమైన విద్య చదువులకు అందుతుందని వివరించారు. టీచ్ టూల్ రాష్ట్రపరిశీలకులు అబ్రహం లింకన్ మాట్లాడుతూ పరిశీలకులు సత్వరమే తమకు కేటాయించిన పాఠశాలలోని ఉపాధ్యాయులను తరగతి గది పరిశీలన అభ్యాసన కార్యక్రమాలను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల సమగ్ర శిక్ష ఎఎంవో డాక్టర్ బి.మోజెస్, టెక్నికల్ పరిశీలకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆఫీసర్స్ క్లబ్ నిర్వహణపై విచారణ ప్రారంభం



క్లబ్ నిర్వాహకులను విచారిస్తున్న ఆర్డీవో గ్లోరియా

బాపట్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఆఫీసర్స్ క్లబ్ నిర్వహణపై కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశాల మేరకు బుధవారం విచారణ చేపట్టారు. ఆర్డీవో పి.గ్లోరియా విచారణ కమిటీ సభ్యులతో కలిసి ఆఫీసర్స్ క్లబ్‌ను సందర్శించారు. నిర్వాహకులు కూరపాటి మరియదాసు, ఇతర సభ్యులను విచారించారు. ప్రభుత్వ భూమిలో ఉన్న ఆఫీసర్స్ క్లబ్‌లో గేమ్స్‌తోపాటు రీడింగ్ రూమ్ వంటివి నిర్వహించాల్సి ఉన్నట్లు తెలుసుకున్నారు. తగిన నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఆర్డీవో పి.గ్లోరియా తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి.రఘునాథరెడ్డి, తహసీల్దార్ షేక్ సలీమా, పట్టణ సీఐ రాంబాబు, రూరల్ సీఐ హరికృష్ణ, కో ఆపరేటివ్, ఆర్ అండ్ బీ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు

కర్లపాలెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోలాయిపాలెంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టీలను, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులలో ఉన్న చదువు సామర్థ్యాన్ని పరిశీలించారు. నాణ్యమైన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మంచి రుచికరమైన ఆహారం వండి విద్యార్థులకు పెట్టాలని నిర్వాహకులకు తెలిపారు.

పంట పొలాలను సంరక్షించండి

భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఆవుల బారి నుంచి తమ పంట పొలాలను సంరక్షించాలని బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భట్టిప్రోలులో టీఎం రావు ఉన్నత పాఠశాల పక్కన ఉన్న పంట పొలాలకు ఆవుల బెడద ఎక్కువైంది. దీంతో రైతులంతా బుధవారం పొలాల్లో ఉన్న ఆవులను తీసుకువచ్చి పాఠశాలలో కట్టివేశారు. సదరు విషయాన్ని పోలీసులకు లిఖిత పూర్వకంగా అందజేసి ఆవుల యజమానులకు వాటిని అప్పగించి తిరిగి తమ పంటలు నాశనం చేయకుండా ఆవులను జాగ్రత్త చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలి : రమాదేవి



ప్రచారం నిర్వహిస్తున్న ఐద్వా రాష్ట్రకార్యదర్శి డి.రమాదేవి

రేపల్లె, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : శాసనమండలిలో హక్కుల కోసం కేఎస్ లక్ష్మణరావు నిరంతరం పోరాడుతూ ప్రజలకు అండగా ఉంటారని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. బుధవారం ప్రభుత్వ కార్యాలయం, కోర్టు ప్రాంగణంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణ్‌రావు గెలుపుకోసం ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శాసనమండలిలో పట్టభద్రుల ఉపాధ్యాయుల కోసం కేటాయించిన స్థానాల్లో వారికి ప్రాతినిధ్యం ఇవ్వటం ద్వారానే ప్రజల హక్కులు కాపాడతాయని అన్నారు. పీడీఎఫ్ అభ్యర్థి అయిన కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేపల్లె నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మోపిదేవి శ్రీనివాసరావు, జైభీమ్ భారత్ పార్టీ ఇన్‌చార్జ్ రమేష్‌రాంజీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన గోపాలరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, బీఎల్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటర్లకు అవగాహన సమావేశం

నగరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో గ్రాడ్యుయేట్ ఓటర్లు తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునే విధంగా అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశానికి నోడెల్ ఆఫీసర్ పద్మావతి అధ్యక్షత వహించారు. ఈసమావేశానికి నగరం, భట్టిప్రోలు, అమర్తలూరు తహసీల్దార్ నాంచారయ్య, శ్రీనివాసరావు, నెహ్రూబాబు, నగరం ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు హాజరయ్యారు. వివిధ సచివాలయాల సిబ్బంది బూత్ లెవల్ ఆఫీసర్లు, గ్రాడ్యుయేట్ ఓటర్లు హాజరయ్యారు.

ఇన్‌చార్జి ఈవోపీఆర్డీగా రవిశంకర్

అమృతలూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి) : అమృతలూరు మండల గ్రామ పంచాయతీరాజ్ విస్తరణాధికారిగా మాకినేని రవిశంకర్ బాధ్యతలు స్వీకరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో రవిశంకర్‌ను పూలమాలలతో అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ రావర్ల నరేంద్రకుమార్, ఎంపీడీవో మారుతీ శేషమాంబ, తెనాలి అర్బన్ బ్యాంక్ చైర్మన్ వంగమూరి హరిప్రసాదరావు, వీరమాచినేని తిరుమలరావు, ఉప్పాల అజయ్‌కుమార్ తదితరులు రవిశంకర్‌కు అభినందనలు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికిగాయాలు

చెరుకుపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆరుంబాక వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదం భానీపురానికి చెందిన మస్తాన్‌రావు గాయపడ్డారు. ఆయన చెరుకుపల్లి నుంచి ఇంటికి కుమార్తెను తీసుకుని వెళ్తుండగా కారు వేగంగా వచ్చి వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. స్వల్ప గాయాలతో ఉన్న మస్తాన్‌రావును స్థానిక వైద్యశాలకు తరలించారు. ప్రమాదం జరిగిన తరువాత కారులోని వారు పారిపోవడానికి ప్రయత్నించడంతో స్థానికులు వారిని పట్టుకుని పోలీసులకు అప్పచెప్పారు.

ఉపకార వేతనాలకు విద్యార్థుల ఎంపిక

కర్లపాలెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ప్రతిభ ఉపకార వేతన పరీక్షకు కర్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎం.వీరజ్యోతి తెలిపారు. ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ.12 వేల చొప్పున 4 సంవత్సరాలు పాటు ఉపకార వేతనాలు అందుతాయని వీరజ్యోతి తెలిపారు. విద్యార్థినులు ఎస్‌కే శంషాది, సుభానా, పి.సుశి, పి.వినూత్న ఎంపికయ్యారన్నారు. వీరిని ఉపాధ్యాయులు ఉదయ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు, ఎ.వెంకటేశ్వరరావు, పీఈటీ సుబ్బారెడ్డి అభినందించారు.

తాగునీటి సౌకర్యానికి రూ.13 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు

● ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్రభుత్వానికి పంపిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

వేమూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో ఉన్న 89 గ్రామాలలో తాగునీటి సౌకర్యం నిమిత్తంగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రూ.13 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. జలజీవన్ పథకం కింద 19 పనులకు రూ.10 కోట్ల 66 లక్షల 30 వేలు అంచనాలు కలెక్టర్ ద్వారా ప్రత్యేక నిధుల కేటాయింపుతో 10 పనులు చేపట్టేందుకు రూ.57 లక్షల అంచనాలతో నివేదికను తయారు చేసి ప్రభుత్వం కలెక్టర్‌కు పంపినట్లు ఐదు మండలాల ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఏఈలు తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా వేమూరు మండలంలోని కోడిపర్రు, చావలి, పెరవలిపాలెం గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న ట్యాంకుల మరమ్మతులు, పైపులైన్ విస్తరణ, పెరవలిపాలెంలో నూతనంగా ట్యాంకు నిర్మాణం కోసం రూ.2 కోట్ల 29 లక్షల 20 వేల అంచనాల ప్రతిపాదనలు పంపారు. కొల్లూరు మండలంలోని కిష్కిందపాలెం, పోతార్లంక గ్రామాలకు సంబంధించి రూ.15 లక్షల 89 వేలు, అమృతలూరు మండలంలో అమృతలూరు, బోడపాడు, గోపాయపాలెం యలవర్రు, ఇంటూరు, ప్యాపర్రు, గోవాడ గ్రామాల్లో పనులు చేపట్టేందుకు రూ.5 కోట్ల 61 లక్షల 30 వేలు, చుండూరు మండలంలోని మండూరు, ఆలపాడు గ్రామాలలో రూ.కోటి 23 లక్షల 41 వేలు, భట్టిప్రోలు మండలంలోని కోనేటిపురం, భట్టిప్రోలు, అద్దేపల్లి గ్రామాల్లో పనులు చేపట్టేందుకు రూ.కోటి 36 లక్షల 70 వేల అంచనాలతో కూడిన ప్రతిపాదనలు పంపారు. కలెక్టర్ ద్వారా విడుదల చేసే ప్రత్యేక నిధుల నిమిత్తంగా వేమూరు మండలంలోని చదలవాడ, బలిజేపల్లి, అబ్బనగూడవల్లి గ్రామాల్లో పైపులైన్ల మరమ్మతులు మోటార్లు కొనుగోలు నిమిత్తం రూ.28 లక్షలు, అమృతలూరు మండలంలో అమృతలూరు, ఇంటూరు, ప్యాపర్రు గ్రామాల్లో రూ.14 లక్షలు, చుండూరు మండలంలోని ఆలపాడు గ్రామంలో రూ.5 లక్షలు, భట్టిప్రోలు మండలంలోని పెదపులివర్రు పంచాయతీ పరిధిలో ఉన్న అక్కివారిపాలెం, భట్టిప్రోలు, పెదలంక గ్రామాలకు కలిపి రూ.38 లక్షల అంచనాలతో కూడిన ప్రతిపాదనలు పంపారు. అత్యవసర పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే ఆనందబాబు సిఫార్సు మేరకు ప్రత్యేక నిధులను కోరుతూ అమృతలూరు మండలంలోని అమృతలూరు, మోపర్రు, గోపాయపాలెం, తురుమెళ్ళ, యలవర్ర గ్రామాలకు రూ.44 లక్షలు, కొల్లూరు మండలంలోని రావికంపాడు, తోకలవానిపాలెం, జువ్వలపాలెం గ్రామాలకు రూ.19 లక్షలు, చుండూరు మండలంలోని వలివేరు, చుండూరు, చినపరిమి జగజ్జీవన్‌రామ్ కాలనీ, అంబేద్కర్‌నగర్ కాలనీ, చినగాదెలవర్రు గ్రామాలకు రూ.34 లక్షల 50 వేలు, భట్టిప్రోలు మండలంలోని పెదపులివర్రు, భట్టిప్రోలు, పెదలంక గ్రామాలకు రూ.40 లక్షలు, వేమూరు మండలంలోని చదలవాడ, అబ్బనగూడవల్లి, బలిజేపల్లి, చావలి గ్రామాలకు రూ.36 లక్షలతో కూడిన ప్రతిపాదనలను పంపినట్లు అధికారులు వివరించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి : ఆర్డీవో



పట్టణంలో మొక్కలను నాటుతున్న ఆర్డీవో రామలక్ష్మి

రేపల్లె, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి వాటిని సంరక్షించాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. పట్టణంలో వినాయకుని గుడి వద్ద, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో ఉన్న చెత్త పాయింట్లను బుధవారం తొలగించి ఆ ప్రదేశంలో మొక్కలను నాటారు. ఆమె మాట్లాడుతూ గ్రీన్ రేపల్లెగా తీర్చిదిద్దటానికి పట్టణవాసులు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. కమిషనర్ సాంబశివరావు మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ఉన్న చెత్త పాయింట్లను శుభ్రం చేసి మొక్కలను నాటటం జరిగిందని తెలిపారు. చెత్తను రోడ్డు మీద వేయకుండా ఉండాలని ప్రజలను కోరారు. స్వచ్ఛ రేపల్లెగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

హిందీ భాషను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలి

● కేంద్ర హిందీ భాషా సలహా మండలి సభ్యురాలు గానకళావతి



శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళావతి తదితరులు

వేమూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారతాన్ని జాగృతం చేసి ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాష దోహదపడుతుందని కేంద్ర హిందీ భాషా సలహా మండలి సభ్యురాలు గాన కళావతి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న భాషా ఉత్సవాలలో భాగంగా బుధవారం హిందీ భాషా ఉత్సవాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గాన కళావతి మాట్లాడుతూ, జాతీయ భాషగా వెలుగొందుతున్న హిందీ భాషను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని సూచించారు. అలాగే మాతృభాషను విడవద్దని హితవు పలికారు. హిందీ ఉపాధ్యాయురాలు జి.సరిత పాఠశాల విద్యార్థులతో హిందీ భాష ద్వారా పలు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. హిందీలో పలువురు విద్యార్థులు అనేక గీతాలను ఆలపించారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసకుమార్, శివయ్య, పోతురాజు, రవిరాజు పాల్గొన్నారు.

పేదలకు.. ఆరోగ్య రక్ష

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేద కుటుంబాలకు ఆరోగ్య భీమాను కల్పించాలనే ఉద్దేశంతో కేంద్రం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. మార్గదర్శకాల ప్రకారం అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం ఈ కార్డు ద్వారా అందనుంది. ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను లబ్ధిదారులకు అందించే కార్యక్రమానికి గతేడాదే కేంద్రం శ్రీకారం చుట్టింది. కానీ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. అర్ధాంతరంగా అప్పుడు నిలిచిపోయిన దశ నుంచి తాజాగా వైద్యఆరోగ్యశాఖ మొదలుపెట్టింది. దీనిలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ఈ పథకం అందేలా చూడడంతో పాటు గతంలో ఈకేవైసీ పూర్తికాని వారి ఇళ్లకు యంత్రాంగం వెళ్లి అది పూర్తయ్యేలా చూస్తోంది. ఏఎన్ఎంలు లబ్ధిదారుల వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన డేటాను గతంలోనే కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి పంపి ఉంది. అందులో జిల్లాల వారీగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారి కుటుంబాల వివరాలు నమోదు చేసి ఉండడంతో ఏఎన్ఎంలు నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి ప్రక్రియను ఓ కొలిక్కి తెచ్చే పనిలో నిమగ్నమయి ఉన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే దాదాపు 80 శాతం నమోదు పూర్తవడంతో పాటు లబ్ధిదారుల జాబితా కూడా తయారయిందని, త్వరలోనే వీరందరికీ ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను జారీ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

- ఆయుష్మాన్ భారత్ పేరుతో కేంద్రం పథకం
- కుటుంబానికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం
- ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 7 లక్షల కుటుంబాలకు మేలు
- బాపట్ల జిల్లాలోనే 2.25 లక్షల మంది ఆయుష్మాన్ గొడుగు కిందకి
- గతేడాది ఎన్నికలకు ముందు అర్ధాంతరంగా ఆగిన ప్రక్రియ
- ప్రస్తుతం ఓ కొలిక్కి.... త్వరలోనే కార్డుల జారీ





(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఈ పథకం ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 7 లక్షల నిరుపేద కుటుంబాలకు మేలు జరగనుంది. ఒక్క బాపట్ల జిల్లాలోనే ఈ సంఖ్య 2.25 లక్షల మందిగా ఉంది. లబ్ధి పొందనున్న కుటుంబాల సంఖ్య ఇలా ఉంటే సభ్యులు పరంగా చూస్తే ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే దాదాపు పది లక్షల మందికి ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది. కొత్తగా లబ్ధిదారుల నమోదు ప్రక్రియతో పాటు గతంలో ఈకేవైసీ చేయించుకోని వారిపై కూడా యంత్రాంగం దృష్టి పెట్టి ఇంటింటికీ తిరిగి దానిని పూర్తి చేయిస్తున్నారు

5 లక్షల వరకు వైద్యం ఉచితంగా...

ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా హెల్త్ కార్డు అందుకున్న కుటుంబానికి 5 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందనుంది. ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ పరిధిలో ఉన్న హాస్పిటల్స్ అన్నీ ఈ పథకానికి కూడా సేవలందించనున్నాయి. బీపీఎల్ పరిధిలో లేకపోయినా 70 ఏళ్లు దాటిన వారంతా ఈ పథకానికి అర్హులేనని ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. దీని ద్వారా మరింత మంది లబ్ధిదారుల జాబితాలో చేరుతున్నారు. కేంద్రం నుంచి వచ్చిన జాబితా ఆధారంగా క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు సర్వే చేపడతారు. ఆ వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయడం, తర్వాత దశలో ఈకేవైసీ, ఫీల్డ్ లెవెల్ సర్వే తర్వాత కార్డుల జారీ చేపట్టనున్నారు. ఈ కార్డుల జారీకి సంబంధించి చాలా వరకు ప్రక్రియ గతేడాది సార్వత్రిక ఎన్నికలకు ముందే పూర్తయింది. కానీ ఎన్నికల కోడ్ రావడంతో అప్పట్లో అది అర్ధాంతరంగా నిలిచిపోయింది. కేంద్రం తాజాగా ఆ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలలో మార్పులు చేయడంతో లబ్ధిదారుల సంఖ్య పెరగనుంది. లబ్ధిదారులకు కార్డుల పంపిణీకి సర్వం సిద్ధం చేసిన ప్రభుత్వం త్వరలోనే వీటిని పేద కుటుంబాలకు అందించనుంది

వైసీపీ ప్రభుత్వ నిర్వాకం కూడా శాపం

పేదలకు ఆరోగ్య రక్ష ఇవ్వడం కోసం కేంద్రం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం అందించడంలో కూడా గత ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించింది. లబ్ధిదారుల డేటా మొత్తాన్ని కేంద్రమే పంపినా తర్వాత ప్రక్రియ పూర్తి చేసి లబ్ధిదారులకు కార్డులు అందించడంలో వైసీపీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించింది. గతేడాది ఎన్నికలకు ముందే ఈ కార్డుల పంపిణీకి సంబంధించిన ప్రక్రియను కేంద్రం ప్రారంభించిన సంగతి తెలిసిందే. కానీ ఈ కార్డులను ఎన్నికలకు ముందే నిరుపేదలకు అందితే రాజకీయంగా నష్టం జరుగుతుందనే భావనతో మొత్తం ప్రక్రియ పై నే గత ప్ర భుత్వం శీత కన్ను వేసింది. నమోదు పూర్తి చేసుకున్న వారు ఈకేవైసీ చేయించుకోవడంలో వైసీపీ మోకాలడ్డింది. పైగా క్షేత్రస్థాయిలో ఈ పథకం మీద అవగాహన కల్పించడంలో కూడా నిర్లక్ష్యం ప్రదర్శించింది. గతేడాదే ఈ పథకానికి సంబంధించి హెల్త్ కార్డులను పెద్దఎత్తున కేంద్రం జారీ చేసింది. కానీ గత ప్రభుత్వ నిర్వాకం వల్ల ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అంతా కలిపి వెయ్యి కార్డులలోపే గతేడాది ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను పేదలు అందుకున్నారు. గత పాలకులు ఈ పథకం విషయంలో కూడా మోసపూరితంగా ఆలోచించడం వల్ల దాదాపు ఏడాది పాటు నిరుపేదలు ఉచితంగా అందే వైద్య సేవలకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ప్రక్రియ అంతా ఓ కొలిక్కి రావడంతో త్వరలోనే కార్డుల జారీని చేపట్టడానికి యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.

రేపు చికెన్, ఎగ్ మేళా

◆ బర్డ్ ఫ్లూపై ప్రజల్లో అపోహలు తొలగించేందుకు కార్యాచరణ

◆ కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేందుకు ఈ నెల 21(శుక్రవారం) గుంటూరులో చికెన్, ఎగ్ మేళాను నిర్వహించనున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. బుధవారం కలెక్టర్ పశుసంవర్ధక శాఖ, ఏపీ పౌల్ట్రీ ఫార్మర్స్ ఫెడరేషన్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడు



కలెక్టర్ నాగలక్ష్మితో సమావేశం అయిన జిల్లాలోని పౌల్ట్రీ ఫార్మర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు

తూ ఇతర జిల్లాల్లో బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్ వినియోగంపై ప్రజల్లో ఉన్న ఆందోళనలు, అపోహలు తొలగించేలా పశుసంవర్ధక శాఖ, పౌల్ట్రీ ఫార్మర్స్ సమన్వయంతో అవగాహన కల్పించాలని అన్నారు. బర్డ్ ఫ్లూ వైరస్ కట్టడికి ముందస్తుగా ప్రభుత్వం సూచించిన బయో సెఫ్టీ ప్రోటోకాల్స్‌ను పౌల్ట్రీ ఫారమ్స్‌లో ఖచ్చితంగా అమలు జరిగేలా పశుసంవర్ధక శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో బర్డ్ ఫ్లూ పరిస్థితులను పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి ఓ నరసింహారావు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలోని పౌల్ట్రీ ఫామ్స్‌లో బర్డ్ ఫ్లూకి సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి కేసులు నమోదు కాలేదని, కోళ్ళకు బర్డ్ ఫ్లూ సోకకుండా ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పౌల్ట్రీ ఫారమ్స్‌లో బయో సెఫ్టీ ప్రోటోకాల్స్ అమలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ సోకిన ప్రాంతాలలో కిలోమీటరు పరిధిలోని పౌల్ట్రీ ఫారమ్స్‌లోని కోళ్ళను పూర్తిగా నాశనం చేయటంతో పాటు, పది కిలోమీటర్ల పరిధిలోని పౌల్ట్రీ ఫారమ్స్‌లోని కోళ్ళ రవాణాను పూర్తిగా నిలిపి వేశారన్నారు. ప్రస్తుతం బర్డ్ ఫ్లూ ప్రచారం వలన చికెన్, కోడిగుడ్లు వినియోగం గణనీయంగా పడిపోయిందని తెలిపారు. చికెన్, కోడి గుడ్లు పూర్తిగా ఉడికించటం వలన వైరస్‌లు నాశనం అవుతాయని, వాటిని తినటం వలన ఎటువంటి వైరస్ సోకవని సురక్షితమని వైద్యులు నిర్ధారించారన్నారు. సమావేశంలో ఏపీ పౌల్ట్రీ ఫార్మర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ వై సురేష్, సభ్యులు నాగేశ్వరరావు, కే గిరిధర్, కిషోర్, వెంకయ్య, రాంబాబు, కిరణ్, జాకీర్ పాల్గొన్నారు.

శోభాయాత్రలో ఘర్షణ, లాఠీచార్జి

దాచేపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు పల్నాడు జిల్లా దాచేపల్లిలో ఘర్షణకు దారి తీసింది. బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను దాచేపల్లిలోని కారంపూడి రోడ్డు నుంచి ప్రారంభించారు. ఈ శోభాయాత్ర దాచేపల్లి ప్రధాన వీధుల్లో పర్యటిస్తూ లైబ్రరీ సెంటర్‌కు చేరింది. లైబ్రరీ సెంటర్‌లో కొంతమంది ఆకతాయిలు శోభాయాత్రపై రాళ్ళు రువ్వారు. దీంతో శోభాయాత్రలో పాల్గొన్న యువకులు కూడా ఆకతాయిలపై తిరిగి రాళ్ళు రువ్వారు. పరస్పర రాళ్ళ దాడులతో దాచేపల్లిలోని లైబ్రరీ



దాచేపల్లి లైబ్రరీ సెంటర్‌లో ఇరు వర్గాలను చెదర గొడుతున్న పోలీసులు

సెంటర్ రణరంగంగా మారింది. అప్పటి వరకు ప్రశాంతంగా ఉన్న వాతావరణం కేకలు, అరుపులతో ఉద్రిక్తంగా మారటంతో సామాన్య ప్రజలు పరుగులు తీశారు. దుకాణాల యజమానులు షాపులు మూసి పరుగులు తీశారు. ఈ సంఘటనతో పోలీసులు లాఠీచార్జ్ నిర్వహించారు. గుంపులు గుంపులుగా ఉన్న స్థానికులను పోలీసులు చెల్లాచెదురు చేశారు. గురజాల డీఎస్పీ జగదీష్, సీఐ భాస్కరరావు, ఎస్ఐలు శివ నాగరాజు, సౌదర్ రాజన్, పాపారావులు 50 మంది పోలీసులతో లైబ్రరీ సెంటర్‌కు చేరుకున్నారు. కనుచూపు మేరలో ఎవ్వరూ లేకుండా తరిమి వేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి స్థాయి బందోబస్తును ఏర్పాటు చేశారు. శోభాయాత్రలో అనుకోని సంఘటన జరగటంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు జరిగిన సంఘటనపై అధికారుల నుంచి సమాచారం తెలుసుకుని చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం.

'గ్రీన్‌గ్రేస్'పై అంబటి చెప్పేవన్నీ అవాస్తవాలు

భజరంగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కి మురళి ఎలా ఓనర్ అయ్యాడో చెప్పే ధైర్యం ఉందా...!

సవాల్ విసిరిన పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్ నిర్మాణంపై అంబటి మురళి అన్నీ అవాస్తవాలు మాట్లాడుతున్నాడని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆరోపించారు. బుధవారం గుంటూరులోని తన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ..... ఆదిత్య ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇచ్చిన రైల్వే ఎన్‌వోసీ రద్దు చేసిన సంగతి గుర్తుందా అంబటి మురళి అని ప్రశ్నించారు. ప్రాజెక్టు ఓనర్ అయిన అంబటి మురళి రాజకీయ అధికార మదంతో నేడు అసలు ఓనర్లను సైతం బెదిరించి స్వాధీనం చేసుకున్నారు. ఆదిత్య ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరు మార్పు చేసుకున్నప్పుడు ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకున్నారా.... నాడు అధికారంలో ఉన్నామనే అహంకారంతో ఏదైనా చేయొచ్చు.. ఏదైనా కట్టొచ్చు అనే మితిమీరి వ్యవహరించారు అని అన్నారు. రూ.కోట్ల విలువైన భూమి అంబటి మురళి సొంతం కాదు,అయిన ఎక్కువ భాగం ఎలా సొంతం చేసుకున్నాడో చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు.

వైసీపీ అధికారంలో ఉండగా మునిసిపల్ అధికారులను, పొల్యూషన్ అధికారులను, రైల్వే అధికారులను సైతం బెదిరించిన సంఘటనలు మరచిపోయావా అని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వున్నదని నాపై అసత్య ఆరోపణలు చేయడం అంబటికి పరిపాటిగా మారిందన్నారు. మునిసిపాలిటీ కార్యాలయంలో కావాల్సిన అన్ని పేపర్లు నీకు అనుకూలంగా ఎలా తెచ్చుకుంటున్నావు... మునిసిపల్ అధికారులు పనులు నిర్వహించవద్దని నోటీసులు జారీచేసినా గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్ పనులు పూర్తి చేశారు, గృహప్రవేశం చేయడం కూడా జరిగింది అని నరేంద్ర అన్నారు. అంబటి మురళి డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు సహకారంతోనే మునిసిపల్ కార్యాలయంలో పనులు చేయించుకుంటున్నారని నరేంద్ర ఆరోపించారు. రేరా సంస్థలో ఉన్న చందు సాంబశివరావు, కామేశ్వరరావు అనే ఇరువురిని అడ్డుపెట్టుకుని నిబంధనల ఉల్లంఘన చేసిన ఘటన అంబటి మురళికి గుర్తు లేదా అని విరుచుకుపడ్డారు.



విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తున్న పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

సంఘం డెయిరీ విషయంలో కాని తన కుటుంబంపై చేసిన ఆరోపణలు విషయంలో గాని ఇష్టానుసారంగా మాట్లాడటం తగదన్నారు.

అంబటి రాంబాబును అడ్డుపెట్టుకుని గ్రీన్ గ్రేస్ నుంచి షాడో ఎమ్మెల్యేగా చేసిన దోపిడీ తీరుపై మాత్రమే ఎన్నికల సమయంలో మాట్లాడటం జరిగిందని, ఏపీ ప్రభుత్వానికి తక్షణమే ఒక ఉత్తరం రాసి విచారణ జరిపించాలని కోరే దమ్ముందా అంటూ సవాల్ విసిరారు.

రైతులకు కష్టం వస్తే ఐదేళ్లు పట్టించుకోలేదు

జగన్మోహన్‌రెడ్డి గుంటూరు మార్కెట్ యార్డు వద్దకు వచ్చి ఇష్టానుసారంగా మాట్లాడి వెళ్లిపోయాడు.. రైతులకు కష్టం వస్తే 5సం. లు పట్టించుకోకుండా వదిలేసిన వైసీపీ ప్రభుత్వం రైతుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే నరేంద్ర ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల బాగోగుల దృష్ట్యా ఎన్నో పథకాలపై దృష్టి సారించారన్నారు. జగన్మోహన్ రెడ్డికి ఎన్నికలు నిబంధనలు పట్టవు, ఆయన ఇంకా అధికారంలోనే ఉన్నట్లు ఫీల్ అవుతున్నాడనీ, జగన్మోహన్ రెడ్డికి ప్రతిపక్ష హోదా లేకపోయినా స్వేచ్ఛగా తిరుగు తున్నాడన్నారు. గతంలో ప్రతిపక్ష పార్టీలు బయటకు వస్తే అక్రమ అరెస్టులు చేసిన సంగతి మరచిపోయారా అని ఈ సందర్భంగా నర్రేంద అన్నారు.

ఆక్వా రంగంలో మెండుగా ఉపాధి అవకాశాలు

ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆక్వా రంగంలో అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు అన్నారు. ఏఎన్‌యూలో జువాలజీ అండ్ ఆక్వా కల్చర్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. డెవలప్మెంట్ ఇన్ ఆక్వా కల్చర్ మేనేజ్మెంట్ అనే అంశంపై జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ గంగాధరరావు మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌ను ఉపయోగించి సాగు వినియోగాన్ని వివరించారు. సులువుగా సాగు చేసే పద్ధతులను సాంకేతికంగా అభివృద్ధి చేసేలా కొత్త మెలకువలు పెంపొందించుకోవాలని సూచించారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య వీ వెంకటరత్నమ్మ మాట్లాడుతూ టెక్నాలజీతో కూడిన సెన్సార్ వినియోగంతో ఆక్వా సాగు చేయవచ్చునన్నారు. సదస్సుకు ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించిన ఆచార్య వీవీ కృష్ణ మాట్లాడుతూ ఆక్వా కల్చర్ గొప్పతనాన్ని తద్వారా చేపలు, రొయ్యలు ఆహారంగా తీసుకోవడం వల్ల కలిగే పోషక విలువల గురించి తెలియజేశారు. పాలకమండలి సభ్యులు ఆచార్య కే సుమంత్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు నదీ తీర ప్రాంతం ఎక్కువగా ఉందని అందులో సాగు చేపట్టినట్లయితే జీడీపీ



సమావేశంలో ప్రసంగిస్తున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

పెంచుకుని ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఆచార్య యం.జగదీష్ నాయక్ ఆక్వా కల్చర్ సాగులో సస్టైనబుల్ ప్రాక్టీస్‌ను వివరించారు. ఈ సదస్సు లో ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కే వీరయ్య, ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆచార్య ఎం. శ్రీనివాసులు రెడ్డి, ఆచార్య వీ లోకనాథ, ఆచార్య వీ పద్మావతి అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరంలో ఏఎన్యూ విద్యార్థుల ప్రతిభ

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ సమైక్యత శిబిరంలో ప్రతిభ కనబరిచారు. ఈనెల 3వ తేదీ నుంచి 9 వరకు నరసాపురంలోని వైఎన్ కళాశాలలో జాతీయ సేవా విభాగం, మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ సంయుక్తంగా జాతీయ సమైక్యత శిబిరం జరిగింది. ఈ శిబిరంలో దేశ వ్యాప్తంగా 12 రాష్ట్రాల నుంచి 200 మంది వలంటీర్లు పాల్గొన్నారు. పలు కార్యక్రమాలలో ఏఎన్యూ వలంటీర్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని కళ్లకు కట్టినట్టు చూపారు. మిగిలిన రాష్ట్రాల వాలంటీర్ల కంటే నాగార్జున యూనివర్సిటీ వలంటీర్లు ప్రతిభ కనబరిచినట్లు మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్ అధికారులు ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను బుధవారం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే. గంగాధరరావు, ఇన్చార్జి రెక్టర్ ఆచార్య కే. రత్న షీలా మణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలంలు అభినందించారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ విభాగం అధికారులు అందజేసిన ధ్రువీకరణ పత్రాలను, షీల్డ్‌లను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య వి. దివ్య తేజ మూర్తి, జ్యోతిరావు పూలే డైరెక్టర్ ఆచార్య త్రిమూర్తి రావు, దూరవిద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ రామ చంద్రన్, పీజీ ప్రవేశాల విభాగం డైరెక్టర్ ఆచార్య పి. బ్రహ్మజీరావు, ఎన్ఎస్ఎస్ విభాగం సీనియర్ అసిస్టెంట్ కే. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

● ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. బుధవారం గుంటూరు సీపీఐ జిల్లా కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రథమ నిర్మాణ మహాసభ ఘనంగా జరిగింది. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే వ్యవస్థలో కీలక భూమిక పోషిస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులేనని అన్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమవుతామని స్పష్టం చేశారు. 15,000 మంది ప్రకృతి వ్యవసాయ ఉద్యోగస్తులకు కనీస వేతనం లేదని, పని భద్రత, ఉద్యోగ భద్రత లేదన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏ ఐ టీ యూ సీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, హనుమంతరావు అరుణ్, రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

● కార్యవర్గ ఎన్నిక

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నూతన కమిటీని ఎనుకున్నారు. యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా వెలుగురి రాధాకృష్ణమూర్తి, నూతన అధ్యక్షుడిగా శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా ఎం. రమేష్ బాబు, కోశాధికారిగా నాగేశ్వర రెడ్డి, ఉపాధ్యక్షులుగా వరప్రసాద్ (గుంటూరు), సునీల్ కుమార్ (కడప), రాహేల్‌రావు (బాపట్ల), విజయలక్ష్మి (ఎన్టీఆర్), సుధారాణి (బాపట్ల), సహాయ కార్యదర్శులుగా శ్రీనివాసరావు (విజయనగరం), వీరరాఘవయ్య (తిరుపతి), శ్రీహరి (ప్రకాశం), రమాదేవి (నంద్యాల)తో పాటు 21 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రావులపల్లి రవీంద్రనాథ్, పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు



విద్యుత్ వినియోగదారుల అదాలత్‌లో మాట్లాడుతున్న విశ్రాంత జిల్లా సెషన్స్ న్యాయాధికారి, సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్

విద్యుత్ అదాలత్‌లో సమస్యల పరిష్కారం

- అధికారులు బాధ్యతగా పనిచేయాలి
- నిరాధార ఆరోపణలు చేస్తే ఫిర్యాదుదారులపై చర్యలు
- విశ్రాంత జిల్లా సెషన్స్ న్యాయాధికారి, సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ విక్టర్ ఇమ్మానియేల్

అద్దంకి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ అదాలత్‌ల ద్వారా వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తామని రిటైర్డ్ జిల్లా సెషన్స్ న్యాయాధికారి, సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్ అన్నారు. అద్దంకిలోని శింగరకొండ రోడ్డులో ఉన్న విద్యుత్ కార్యాలయం ఆవరణలో బుధవారం విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఇమ్మానియేల్ మాట్లాడుతూ విద్యుత్ అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. అధికారుల ప్రవర్తనపై, అవినీతి పై తరచూ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వినియోగదారులతో మర్యాదగా మెలగాలన్నారు. వినియోగదారులు కూడా అధికారులపై నిరాధారమైన ఆరోపణలు చేయరాదన్నారు. నిరాధార ఆరోపణలు అని తేలితే ఫిర్యాదుదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల సమయంలో తనిఖీ అధికారులు ఇష్టానుసారం కేసులు రాయకుండా నిబంధనల మేరకే వ్యవహరించాలన్నారు. అద్దంకిలో 3వ సారి విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. రెండు సంవత్సరాలలోపు సమస్యలను అర్జీల రూపేణ ఇస్తే పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. విజయవాడలోని సీజీఆర్ఎఫ్ కార్యాలయంలో కూడా నేరుగా అర్జీలు అందజేయవచ్చన్నారు. అద్దంకిలో జరిగిన విద్యుత్ అదాలత్‌లో మొత్తం 8అర్జీలు రాగా, అందులో 4 అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన 4 అర్జీలకు సంబంధించి 15 రోజులలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో సీజీఆర్ఎఫ్ సభ్యులు వెంకటకృష్ణ, శ్రీనివాసులు, సునీత, ఎస్ఈ ఆంజనేయులు, ఈఈ నల్లూరి మస్తాన్‌రావు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో నలుగురికి అపరాధ రుసుం

అద్దంకి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వ్యక్తులను బుధవారం అదుపులోకి తీసుకొని కోర్టు లో హాజరుపరచగా సెకండ్ క్లాస్ మేజి స్ట్రేట్ అపరాధ రుసుం విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. హైదరాబాద్ నుంచి చెన్నై వైపు వెళ్తున్న ఐషర్ లారీ డ్రైవర్ బాబూనాయక్ మద్యం సేవించి నడుపుతున్నట్లు గుర్తించి బుధవారం ఉదయం డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. మరో ముగ్గురు మోటార్‌సైకిల్స్ నడుపుతున్న వ్యక్తులకు కూడా డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించగా మద్యం సేవించినట్లు గుర్తించారు. 4 గురుని కోర్టులో హాజరుపరచగా లారీ డ్రైవర్ బాబూనాయక్‌కు 10 వేల రూపాయలు, మిగిలిన ముగ్గురు మోటార్‌సైకిల్స్ నడుపుతున్న వ్యక్తులకు రూ.2వేల చొప్పున సెకండ్ క్లాస్ న్యాయాధికారి శింగయ్య అపరాధ రుసుం విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

కట్టెల ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి

మరొకరికి గాయాలు

అద్దంకి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మోటార్‌సైకిల్‌ను కట్టెల ట్రాక్టర్ ఢీకొనడంతో ఎనికపాటి చౌదరి(19) అక్కడికక్కడే మృతి చెం దగా, మరో యువకుడు అనిల్‌కు తీ వ్రగాయాలు అయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. అద్దంకి మండలం తిమ్మాయపాలెంకు చెందిన చౌదరి, అనిల్ మోటార్ సైకిల్‌పై బుధవారం రాత్రి కుంకుపాడు వైపు నుంచి తిమ్మాయపాలెం వస్తుండగా కొటికలపూడి సమీపంలో ఎదురుగా వస్తున్న కట్టెల ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చౌదరి అక్కడికక్కడే మృతి చెందగా, అనిల్‌కు తీవ్ర గాయాలు కావడంతో అద్దంకి వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు తరలించారు. ఘటనాస్థలాన్ని సీఐ సుబ్బరాజు పరిశీలించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ సుబ్బరాజు

వంద శాతం పనిదినాలు సాధించాలి



సమవేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సింగయ్య

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలోని ఫీల్డ్ అసిస్టెంట్‌లు అందరు మార్చి నాటికి వంద శాతం ఉపాధి పనులు కల్పించేందుకు కృషి చేయాలని ఎంపీడీవో బత్తిని సింగయ్య సూచించారు. బుధవారం తన కార్యాలయంలో మండలంలోని ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టీఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మార్చి చివరి నాటికి 62000 పనిదినాలు కల్పించాలన్నారు. 6200 మంది కూలీలకు ఈ-శ్రమ కార్డులు రిజిస్ట్రేషన్ ఈ నెల చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం 10 ఫారం పాండ్లు గుర్తించి గుర్తించి మార్చి చివరినాటికి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ నాగరాజు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోండి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పారిశుధ్యం మెరుగునకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సింగయ్య సూచించారు. బుధవారం మండలంలోని గోపాలపురం ఎస్టీ కాలనీలో పర్యటించిన ఆయన గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రెండు కమ్యూనిటీ సోక్ పిట్స్ నిర్మాణం చేయాలని, చెత్త మొత్తం అక్కడ నుంచి తరలించాలని ఆదేశించారు. సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలలో కేఆర్‌కే విద్యార్థుల ప్రతిభ

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీల ద్వారా పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు అన్నారు. ఈ నెల 8వ తేదీన ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీలో జరిగిన వ్యాసరచన పోటీలలో కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. ఎన్.చిన్న లింగయ్య(బీఏ), ఎన్.శారమ్మ వరుసగా రూ.5116 రూ.1116 నగదు బహుమతులను గెలుపొందారు. ఈ సందర్భంగా బుధవారం విజేతలైన విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కుటుంబాల్లో స్ట్రోక్ కలకలం

- గుండెపోటు మరణాలతో తల్లడిల్లుతున్న ప్రజలు
- ఇటీవల తరచూ ఘటనలు
- నియంత్రణకు ప్రభుత్వం కృషి
- బాధితుల కోసం అందుబాటులో ఇంజక్షన్
- 6 గంటల్లోపు తీసుకుంటే ప్రయోజనమంటున్న వైద్యులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో చీరాల, చుట్టు పక్కల ప్రాంతాల్లో గుండెపోటు మరణాలు అధికంగా నమోదవుతున్నాయి. గతంలో గుండెపోటు సుమారు 50 సంవత్సరాలు పైబడిన వారికి వచ్చేది. కొద్ది సంవత్సరాలుగా వయసుతో సంబంధం లేకుండా సంభవిస్తున్నాయి. మానసిక ఒత్తిడి, ఆర్థిక సమస్య ఇలా కారణాలేమైనప్పటికీ గుండెపోటు బాధితుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. అనేక మంది అకస్మాత్తుగా చనిపోతుండడంతో అప్పటి వరకూ ఆనందంగా సాగిపోతున్న ఆ కుటుంబాల్లో స్ట్రోక్ కలకం సృష్టిస్తోంది. కుటుంబ పెద్ద, చేతికి అందివచ్చే కొడుకులు మృత్యు కౌగిట్లో చేరుతుండడంతో విచారకరం. దీంతో ఆ కుటుంబాలు దయనీయంగా మారుతున్నాయి. గతనెల 15వ తేదీన కుటుంబంలో ఒకేరోజు ఎవరి పని వారు చేసుకుంటున్న అన్నదమ్ములు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. చీరాల మునిసిపల్ పరిధిలోని గొల్లపాలెంకు చెందిన గొల్లప్రోలు గంగాధర్(42) మృత్యువాత పడగా, అన్నను హాస్పిటల్‌కు తరలించి వైద్య పరీక్షలు చేయించిన తమ్ము డు గోపీ పవన్‌కుమార్(36) అ న్న మరణ వార్త విని అక్కడికక్కడే కుప్పకూలాడు. దీంతో కుటుంబంలో గతంలోనే భర్తను, అనంతరం ఇద్దరు కుమారుళ్లను కోల్పోయిన తల్లి ఒంటరై రోదిస్తుంది. కావూరివారిపాలెం ఆంధ్రకేసరినగర్‌లో భార్య అనారోగ్యంతో చనిపోగా మూడోరోజు భర్త డీ.సతీష్ (42) గుండెపోటుతో మృతి చెందారు. దీంతో వారి ఇద్దరి ఆడ పిల్లలు తీరని వషాదంలో మునిగిపోయారు. అలాగే వైకుంఠపురం శ్రీరామనగర్‌కు చెందిన కావూరి శివాజీ (45) పదిరోజులు కిందట గుండెపోటుతో మృతి చెందారు. పెద్ద దిక్కును కోల్పోయి భార్య, ఇద్దరు పిల్లలు కన్నీరుమున్నీరయ్యారు. ఇలా అనేక కుటుంబాలను స్ట్రోక్ రోడ్డున పడేస్తుంది. ఈనేపథ్యంలో గుండెపోటు బాధితులను కాపాడేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం ఖరీదైన టెనెక్టెప్లస్ ఇంజక్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రిల్లో ఉచితంగా వేసేందుకు చర్యలు చేపట్టడం సంతోషకరం.



హాస్పిటల్లో స్టెమీపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

లక్షణాలు

- ఎడమవైపు గుండె నొప్పి అధికంగా ఉండడం
- కాళ్లు, చేతులు చల్లగా మారడం
- కడుపులో మంట
- కళ్లు బైర్లు కమ్మడం

ఆ గంట చాలా విలువైనది

గుండెపోటు బారిన పడిన వారికి మొదటి గంట చాలా విలువైనది. సమస్య గ్రహించిన వెంటనే ముందుగా సీపీఆర్ చేయించడంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. అలాగే ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో దాదాపుగా మద్యం సేవించడం, పొగతాగడం, పని భారాన్ని తగ్గించుకోవడం, ఒత్తిడికి గురి కాకుండా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆహార నియమాలు కచ్చితంగా పాటించాల్సి ఉంది. అయితే కొవిడ్ అనంతరం ఆరోగ్య సిబ్బంది ఉపయోగించిన ఒక రకమైన వ్యాక్సిన్‌పై ప్రజల్లో పలు అనుమానాలు ఉండగా, వాటిపై వైద్యాధికారులు క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఉంది.



చీరాలలో ఒకేరోజు గుండెపోటుతో మృతి చెందిన అన్నదమ్ములు

గుండెపోటుపై ప్రత్యేక అవగాహన



గుండెపోటు మరణాలు తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సమస్య ఉన్న వారిని గుర్తించి వెంటనే టెనెక్టెప్లస్ ఇంజక్షన్ ఇస్తే ప్రమాదం నుంచి విముక్తి ఉంటుంది. దీని ఖరీదు ప్రైవేటుగా రూ.40వేల వరకు ఉండగా, ప్రభుత్వం ప్రభు త్వ వైద్యశాల్లో ఉచితంగా సరఫరా చేస్తోంది. దీనిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు స్టెమీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. గుండెపోటు సమస్యగా అనుమానం వస్తే వెంటనే ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించడం వలన ప్రమాదం నుంచి రక్షించుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితులలో 30 సంవత్సరాలు దాటిన ప్రతిఒక్కరూ ప్రతి ఆరు నెలలకు చెకప్ చేయించుకోవడం మంచిది. అలాగే ఆహారంలో జాగ్రత్తలు, వ్యాయామాలు వంటివి చేయడం ఆరోగ్యకరం.

- డా.సుభాషిణి, సూపరింటెండెంట్, చీరాల ఏరియా హాస్పిటల్



గుండెపోటు ఇంజక్షన్‌లు నిల్వ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పెరుగుతున్న రోగుల సంఖ్య



గుండె వ్యాధి సమస్యలతో రోజుకు రెండు లేక మూడు కేసులు వస్తున్నాయి. ఇలా చూసుకుంటే మా ఒక్క హాస్పిటల్‌కే సుమారు నెలలో 50 మందికి వైద్యం అందిస్తున్నాం. ఇటీవల కాలంలో హృదయ రోగుల సంఖ్య పెరుగుతుంది. సమస్యకు దూరంగా ఉండాలంటే వ్యాయామం, సక్రమమైన ఆహారం అవసరం.

- డా.ఐ.బాబూరావు, గుండెవైద్య నిపుణుడు, ప్రేమ నర్సిం

అద్దంకిలో మినీ బైపాస్‌కు రెడీ



అద్దంకిలో మినీ బైపాస్‌గా మార్చనున్న అద్దంకి మేజర్ కాలువ.. మినీ బైపాస్ నిర్మాణం కోసం తొలగించాల్సిన కాలువ కట్టపై ఉన్న తాత్కాలిక ఇళ్లు

రూ.15కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న మున్సిపల్ అధికారులు

అద్దంకి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలో ట్రాఫిక్ సమస్య కు తాత్కాలికంగా ఉపశమనం కోసం మినీ బైపాస్‌కు మున్సిపల్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రూ.30కోట్లతో మినీ బైపాస్ రోడ్డు నిర్మాణం జరగబోతుందంటూ హడావుడి చేసిన వైసీపీ నేతలు రూపాయి నిధులు కూడా మంజూరు చేయించలేదు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు రాకపోకలకు కూడా ఇబ్బంది పడ్డారు. ఎన్నికల సమయంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ హామీ ఇచ్చిన మేరకు మినీ బైపాస్ నిర్మాణం కోసం దృష్టి సారించారు. మంత్రి రవికుమార్ ఆదేశాలతో మున్సిపల్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అద్దంకి మేజర్ కాలువ పై రేణింగవరం రోడ్డు నుండి నామ్ రోడ్డు వరకు సుమారు 1.600 కి.మీ దూరం రెండు వైపులా సీసీ రోడ్లు నిర్మాణం, సైడ్ డ్రైన్‌లు, విద్యుత్ లైట్లు ఏర్పాటుకు సుమారు రూ.15కోట్లు ఖర్చు అవుతుందని అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. మధ్యలో యథావిధిగా సాగర్ జలాలు ప్రవహించేందుకు కాలువ ఉంచనున్నారు. ఆయా కాలనీల నుంచి వచ్చే మురుగు నీటి కోసం రెండు వైపులా సైడ్ డ్రైన్ లు ఏర్పాటు చేయనున్నారు. అయితే అద్దంకి మేజర్ కాలువ, కట్టలను ఆక్రమించి సుమారు 50 మంది తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్నారు. గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు కేటాయింపు జరిగినా బొమ్మనంపాడు రోడ్డు లో ఉన్న లేఅవుట్ దూరం అని ఇళ్ల నిర్మాణాలకు నిరాకరించారు. దీంతో ప్రత్యామ్నాయంగా స్థల సేకరణ చేసి ఖాళీ చేయించేందుకు రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. మినీ బైపాస్ నిర్మాణం పూర్తయితే అభ్యుదయనగర్, నంబూరివారిపాలెం, టీచర్స్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, వాసవీ నగర్, శివసాయి నగర్, సాయినగర్ తదితర ప్రాంతాల ప్రజలు సులువు గా నామ్ రోడ్డుకు, రేణింగవరం రోడ్డులకు చేరుకునే అవకాశం ఏర్పడుతుంది.

24న పీఎం కిసాన్ నిధులు విడుదల

జిల్లాలో 2.48 లక్షల మంది రైతులకు రూ.49.51 కోట్లు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు బాసటగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధిని ఈనెల 24వతేదీన రైతుల ఖాతాల్లో జమచేయనున్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏడాదికి మూడు విడతలుగా ఒక్కొక్క విడత రూ2వేలను జమ చేస్తోంది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 19 విడతలుగా నగదును జమ చేస్తున్న కేంద్రం 2024-25 ఆర్థిక సంవత్సరం మూడో విడత నగదు జమను ఈనెల 24న చేయనున్నారు. జిల్లాలో 2.48లక్షల మంది రైతులు పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధిపొందుతున్నారు. అందుకు సంబంధించి ఒక్కొక్క రైతుకు రూ.2వేల చొప్పున జిల్లాకు రూ.49.51 కోట్లు జమకానున్నాయి.

వెలుగు పీడీగా నారాయణ బాధ్యతల స్వీకరణ

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వెలుగు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా టి.నారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన రాష్ట్ర సచివాలయంలో ఫైనాన్షియల్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తుండగా మూడు రోజుల క్రితం జిల్లా వెలుగు పీడీగా నియమితులయ్యారు. ఆ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో ఇక్కడ పీడీగా పనిచేసిన వసుంధర శ్రీకాళహస్తికి బదిలీ అ య్యారు. అప్పటి నుంచి ఇన్‌చార్జీల పాలన సాగింది. నారాయణ కలెక్టర్ తమీమ్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

అయ్యో 'పాప'ం

- మానసిక సమస్యతో తల్లి అఘాయిత్యం
- బిడ్డతో సహా చెరువులో దూకి ఆత్మహత్య



సుజాత, యశ్విజ్ఞ మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్సై అజయ్‌బాబు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మానసిక సమస్యతో బాధపడుతున్న ఓ తల్లి తన తొమ్మిది నెలల పాపను తీసుకుని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ వి.అజయ్‌బాబు తెలిపిన సమాచారం మేరకు.. సంతనూతలపాడులోని బాపట్ల బజారుకు చెందిన బాపట్ల వెంకటేష్‌కు, కొనగానివారిపాలెం చెందిన పట్టీ లక్ష్మయ్య కూతురు సుజాతను మూడేళ్ల క్రితం ఇచ్చి వివాహం చేశారు. వీరికి 9 నెలల పాప యశ్విజ్ఞ ఉంది. ఇటీవలి వరకు బాగానే ఉన్నా రెండు నెలల నుంచి మాత్రం సుజాత మానసిక సమస్యతో ఇబ్బంధిపడుతుంఇ. తరచూ తాను చనిపోతానంటూ చెబుతుండేది. దీనికి సంబంధించి చికిత్స పొందుతోంది. కాగా 10 రోజుల క్రితం సుజాత తన బిడ్డను తీసుకుని మంగమూరు వైపు వెళ్లగా, భర్త, తల్లిదండ్రులు వెతికి పట్టుకుని ఇంటికి తెచ్చారని తెలిపారు. ఈ నేపథ్యంలో మరోమారు మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి పాపను తీసుకుని వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న భర్త వెంకటేష్, బంధువులు చుట్టుపక్కల గ్రామాల్లో ఆమె ఆచూకీ కోసం రాత్రంతా విచారించారు. అయితే బుధవారం తెల్లవారుజామున చెరువులో పాప మృతదేహం తేలియాడుతూ ఉండటం చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్ఐ అజయ్‌బాబు గజ ఈతగాళ్లతో వెతికించగా ఉదయం 8 గంటలకు సుజాత మృతదేహం లభ్యమైంది. దీంతో సుజాత తన పాపతో సహా మంగళవారం సాయంత్రమే చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మృతురాలు తండ్రి పట్టీ లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.అజయ్‌బాబు తెలిపారు.



గొనసపూడి గ్రామంలో లబ్ధిదారుని ఇంటి వద్ద తాగునీటిని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు

ప్రతి రోజు నీటిని క్లోరినేషన్ చేయాలి

చినగంజాం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : ప్రతి రోజు తాగునీటిని క్లోరినేషన్ చేసిన తర్వాతే నీటిని సరఫరా చేయాలని జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎం.అనంతరాజు అన్నారు. మండలంలోని గొనసపూడి గ్రామంలోని తాగునీటి చెరువు, ఫిల్టర్ బెడ్లను బుధవారం ఆయన పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెరువులోని నీరు ఏమైనా కలుషితమయ్యాయని ఆయన పరిశీలించారు. చెరువు చుట్టపక్కల ఎరువుదిబ్బలు, జంతు కోబరాలు లేకుండా చూడాలని అన్నారు. చెరవు పరిసరాలు, ఫిల్టర్ బెడ్ల చుట్టుపక్కల ఉన్న చెత్తాచెదారాన్ని సిబ్బందితో పరిశుభ్రం చేయించారు. గ్రామంలోని లబ్దిదారుని ఇంటికి వెళ్లి నీటి పీహెచ్ లెవల్‌ను పరిశీలించారు. జీబీఎస్ వ్యాధి కలకలం సృష్టిస్తున్న నేపథ్యంలో తాగునీటి చెరువులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని ప్రజలు తాగునీటి శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో పర్చూరు డివిజన్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్‌చంద్ర, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దుద్దుకూరు(ఇంకొల్లు) : మండలంలోని దుద్దుకూరు గ్రామంలోని రక్షిత మంచినీటి పథకాన్ని జిల్లా ఆర్‌డబ్ల్యూస్ ఎస్ఈ అనంతరాజు బుధవారం పరిశీలించారు. ఫిల్టర్ బావులు, వాటర్‌హెడ్ ట్యాంకులోని నీరు, రక్షిత వాడుకలో ఉన్న మంచినీటి చెరువులను పరిశీలించారు. క్లోరినేషన్ సక్రమంగా జరుగుతుందో లేదో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పర్చూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎస్.సతీష్, పంచాయతీ కార్యదర్శి శశి, మన్నెం చింపిరయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ఆటోలో ప్రయాణిస్తే చర్యలు

కారంచేడు(పర్చూరు), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులతో రాకపోకలు సాగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై వెంకట్రావు హెచ్చరించారు. బుధవారం కారంచేడు ప్రధాన రోడ్డులో వాహనాల తనిఖీ కార్యక్రమం నిర్వహించారు.

రైతుకు విశిష్ట గుర్తింపు

- ఆధార్ తరహాలో 11 అంకెలతో కార్డు జారీ
- రైతు సంక్షేమ పథకాలకు అదే కీలకం
- జిల్లాలో 4.79 లక్షల మంది
- అందులో పీఎం కిసాన్ లబ్ధిదారులు 2.49 లక్షల మంది
- ఆర్ఎస్‌కేలలో నమోదు, ఇప్పటికే లక్షకుపైగా వివరాలు

ఒంగోలు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజల అన్ని అవసరాలకు ప్రధాన గుర్తింపు కార్డుగా ప్రస్తుతం చెలామణిలో ఉన్న ఆధార్‌కార్డు తరహాలో ఇక నుంచి ప్రతి రైతుకు 11 అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు కార్డు తప్పనిసరి కానుంది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాల లబ్ధి ఇక నుంచి ఈ గుర్తింపు కార్డు ప్రామాణికం కానుంది. పట్టా భూమి ఉండి, పట్టాదారు పాసుపుస్తకం కలిగిన ప్రతిరైతు గుర్తింపు కార్డును తీసుకోవడం తప్పనిసరి. వ్యవసాయ రంగంలో సాంకేతిక అనుసంధానం, ఆధునికీకరణ చర్యలలో భాగంగా కేంద్రప్రభుత్వం ఈ విధానం ప్రవేశపెడుతుండగా ఇప్పటికే ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలో దాదాపు నెలరోజులుగా ఇందుకు సంబంధించి వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందికి దీనిపై అవగాహన కల్పించి ఈనెల 10 నుంచి గుర్తింపు కార్డుల కోసం వివరాలను నమోదు చేస్తున్నారు. ఈనెల 25తేదీని ఇందుకు తుది గడువుగా నిర్ణయించారు. జిల్లాలో మొత్తం 6.05లక్షల హెక్టార్ల సాగు భూమి ఉండగా 4.79లక్షల మందికిపైగా రైతులు ఉన్నట్లు అంచనా. అందులో 2.49 లక్షల మంది కేంద్రప్రభుత్వం అందజేసే పీఎం కిసాన్ పథకం లబ్ధిదారులు ఉన్నారు.

వేగంగా నమోదు ప్రక్రియ

త్వరలో ఈ విడత పీఎం కిసాన్ డబ్బులు రైతుల ఖాతాల్లో పడనుండగా వారు తక్షణం ఈ గుర్తింపుకార్డులు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జిల్లాలో 38 మండలాల్లో ఉన్న 616 రైతు సేవా కేంద్రాలు(ఆర్ఎస్‌కే)లో గుర్తింపు కార్డుల నమోదు ప్రక్రియ చేపట్టారు. ఇప్పటికే లక్ష మంది రైతులకుపైగా ఆయా ఆర్ఎస్‌కేలలో గుర్తింపు కార్డులకోసం తమ వివరాలను నమోదు చేసుకున్నారు. కాగా సొంత పొలం ఉన్న ప్రతి రైతు తమ ప్రాంతానికి చెందిన రైతు సేవా కేంద్రానికి వెళ్లి ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం నకలును అందజేయాలి. ఆధార్‌తో అనుసంధానమైన ఉన్న మొబైల్ ఫోన్ కూడా తీసుకెళ్లి వివరాల నమోదు అనంతరం ఓటీపీ తెలియజేసి విశిష్ట గుర్తింపు కార్డును పొందాల్సి ఉంటుంది.

సేంద్రియ సాగు.. ఆదాయం బాగు

- ఆ ఎరువులకు పెరుగుతున్న డిమాండ్
- ఆరోగ్యమే మహాభాగ్యమంటున్న అధికారులు, రైతులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పంటలకు రసాయనిక ఎరువుల వాడకం ద్వారా పెట్టుబడి ఖర్చు పెరిగింది. మరోవైపు భూసారం కూడా తగ్గింది. ఈక్రమంలో పంటలకు చీడ, పీడలు సోకి ఉత్పత్తులు తగ్గిపోతూ వచ్చాయి. ఇదే విషయాన్ని ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో రైతులు సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారిస్తున్నారు. మారుతున్న కాలానుగుణంగా అన్నదాతల్లో కూడా మార్పు వస్తోంది. గుడ్డిగా పంటలు సాగుచేయకుండా తెలివిగా పంటలకు పెట్టుబడి తగ్గించే దిశగా ఆలోచన చేస్తున్నారు. అన్నదాతలను ఆర్థికంగా గట్టెక్కించాలని వ్యవయసాయ శాఖ అధికారులు కూడా విధిగా తగు సూచనలు. సలహాలు ఇస్తూ సేంద్రియ సాగు, ఎరువుల వాడకంపై రైతులు మళ్లేలా అవగాహన కల్పిస్తున్నారు. అధికారుల సూచనలు తూచ తప్పకుండా రైతులు సేంద్రియ సాగుతో లాభాలను ఆర్జిస్తున్నారు. దీంతో సేంద్రియ ఎరువులకు ప్రస్తుతం డిమాండ్ పెరిగిందనే చెప్పాలి.

భూసారం పెంపొందించేలా చర్యలు

రసాయనిక ఎరువుల వాడకం ద్వారా కలుగుతున్న అనర్థాలపై రైతుల్లో దాదాపుగా చైతన్యం వచ్చింది. దీంతో భూసారాన్ని పెంపొందించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. పశువుల పేడ, కుంటలు, చెరువుల్లో పూడిక మట్టిని పొలాల్లోకి తరలించే పనిలోపడ్డారు. పశు సంపద లేని రైతులు సేంద్రియ ఎరువుల కొనుగోలుపై దృష్టి సారిస్తున్నారు.


సేంద్రియ ఎరువును తయారు చేస్తున్న రైతులు

రబీలో వర్షాధారంపై 2,500 ఎకరాల్లో సాగు

రబీ సీజన్‌లో చీరాల మండలంలో సుమారు రూ.2వేల ఎకరాలు, వేటపాలెం మండలంలో సుమారు 500 ఎకరాలు వర్షాధారంపై వరి, మినుము, మొక్కజొన్న తదితర పంటలను సాగు అవుతున్నాయి. దీంతో రైతులు భూసారాన్ని పెంచుకునేందుకు పొలాల్లో పొడి ఎరువును ట్రాక్టర్‌ల ద్వారా తోలుకునే పనిలో నిమగ్నమయ్యారు. వర్షాలు బాగా కురిసినప్పుడు నేలను దుక్కి చేసేందుకు సిద్ధమవుతున్నారు.

సాగుకు పెట్టుబడి తగ్గుతుంది



సేంద్రియ ఎరువులు వాడితే ఖర్చులు తగ్గుతున్నాయి. నేలను దుక్కి చేసేముందు సేంద్రియ ఎరువులను పొలంలో వేసుకుని దుక్కి చేయడం వలన భూసారం పెరుగుతోంది. ఈక్రమంలో పెద్దగా యూరియా వంటి ఎరువులను వాడాల్సిన అవసరం ఉండదు.

\- గవిని నాగరాజు, రైతు

సేంద్రియ ఎరువులతో ఆదాయం, ఆరోగ్యం



సేంద్రియ ఎరువులతో సాగు చేయడం వలన రైతులకు ఆదాయం, ప్రజలకు ఆరోగ్యం ఉంటుంది. పశువుల పేడ, పూడికమట్టి పొలంలో వేస్తే భూమిలో తేమశాతం పెరుగుతుంది. పురుగులు నశిస్తాయి. పంటలకు తెగుళ్ల ఉండవు. దిగుబడి ఆశాజనకంగా కూడా ఉంటుంది.

\- సుమతి, వ్యవసాయాధికారి, చీరాల



రేణంగివరంలో మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

గుర్తింపు సంఖ్యతో వ్యవసాయ సేవలు సులభతరం

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక గుర్తింపు సంఖ్యతోనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ధనరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని కలవకూరు, సింగరకొండపాలెం గ్రామాలల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ధనరాజ్ మాట్లాడుతూ మండలంలో పీఎం కిసాన్ లబ్ధిదారులు 9642 మంది ఉండగా, ఇప్పటి వరకు 4640 మంది లబ్ధిదారులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించినట్లు చెప్పారు. పీఎం కిసాన్ కింద లబ్ధి పొందిని రైతులకు కూడా 1400 మందికి గుర్తింపు సంఖ్యలు కేటాయించామన్నారు. ప్రతి రైతు గుర్తింపు సంఖ్య కోసం గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు : కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ సేవలు సులభతరం చేసేందుకు భూ యజమానులకు గుర్తింపు సంఖ్య జారీ చేసే ప్రక్రియ చేపట్టిందని ఏవో సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని ఆరికట్లవారిపాలెం, రేణంగివరం గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏవో సుబ్బారెడ్డి సాగులో ఉన్న మొక్కజొన్నను రైతులో కలిసి పరిశీలించారు. ఈ నెల28లోగా గుర్తింపు కార్డు పొందాలన్నారు.కార్యక్రమంలో సిబ్బంది అలగ్జాండర్, శివాని, రైతులు పాల్గొన్నారు.

బల్లికురవ : సాగు భూమి ఉన్న రైతులంతా గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఐడీ నెంబర్ల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయ అధికారి కుమారి కోరారు. బుదవారం మండలంలోని కొత్తూరు, వెలమవారిపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పొగాను పరిశీలించారు.

మల్చింగ్ పద్ధతిలో సాగుతో మేలు

బల్లికురవ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రైతులు మల్చింగ్ పద్ధతిలో పంటలు సాగు చేయడం ఎంతో మేలు అని జిల్లా ఉద్యాన అధికారి పి.జెన్నెమ్మ పేర్కొన్నారు. మండలంలోని గొర్రెపాడు, కూకట్లపల్లి గ్రామాలలో మల్చింగ్ పద్ధతిలో సాగులో ఉన్న పుచ్చను అధికారులు బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మల్చింగ్ పంటలను తెగుళ్ల బారి నుంచి కాపడుకోవడమే కాకుండా కలుపు, నీటి అవిరి కాకుండా మొక్కకు అందుబాటులో ఉంటుందన్నారు. సబ్సిడీపై మల్చింగ్ పట్టలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి హనుమంత్‌నాయక్ పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు మృతి

పలువురు ప్రముఖుల నివాళి


ఆంజనేయులు (ఫైల్)

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు నక్కల ఆంజనేయులు (99) వయోభారంతో మంగళవారం రాత్రి కన్నుమూశారు. బుధవారం టీడీపీ బాపట్ల పార్లమెంట్ పరిశీలకుడు గరటయ్య, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, మాజీ ఎంపీ చిమటా సాంబు, కూరపాటి స్టాలిన్ తదితర నాయకులు, కార్యకర్తలు ఆంజనేయులు పార్థీవదేహానికి నివాళులర్పించారు. బుధవారం స్వగ్రామం వేటపాలెం మండలం పందిళ్లపల్లిలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఆంజనేయులుకు ముగ్గురు కుమారులు, కుమార్తె సంతానం. పెద్ద కుమారుడు గతంలో మరణించారు. రెండవ కుమారుడు నక్కల రమణారావు పంచాయతీ రాజ్ ఈఈగా పనిచేసి, రిటైర్డ్ అనంతరం ప్రస్తుతం బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ వద్ద ఓఎస్డీగా పని చేస్తున్నారు. అలాగే చిన్న కుమారుడు అర్జునరావు రిటైర్డ్ రైల్వే అధికారి. అలాగే కబడ్డీ అంతర్జాతీయ క్రీడాకారునిగా రాణించి రిటైర్డ్ అయ్యారు. కుమార్తె వకులాదేవి ప్రస్తుతం ఒంగోలు కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పార్టీ ప్రారంభించినప్పటి నుంచి ఆంజనేయులు పందిళ్లపల్లి గ్రామంలో పార్టీని బలోపేతం చేసి క్రియాశీలకంగా పనిచేశారు. దీంతో ఆయన మృతిపై పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మానవత్వం చాటుకున్న మణికేశ్వరం గ్రామస్థులు

ముస్లిం సంప్రదాయంతో గుర్తు తెలియని వృద్ధుడికి అంత్యక్రియలు


అంత్యక్రియలకు తీసుకెళ్తున్న ముస్లింలు

అద్దంకి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందడంతో మణికేశ్వరానికి చెందిన ముస్లింలు ముందుకు వచ్చి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. మణికేశ్వరం పునరావాసకాలనీ వద్ద రెండు నెలలుగా సుమారు 70 సంవత్సరాలకు పైగా వయస్సు ఉన్న వృద్ధుడు కదలలేని స్థితిలో ఉన్నారు. గ్రామస్థులు ఇచ్చే ఆహారం తింటూ ఉంటున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం మృతి చెంది ఉన్నట్లు పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌వలి గుర్తించి గ్రామస్థులకు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఐటీడీపీ అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లాతో పాటు పలువురు గ్రామస్థులు ముందుకు వచ్చారు. ఏఎస్సై నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌వలి పర్యవేక్షణలో షేక్ కరిముల్లా, బడావలి, సఫీర్ కరిముల్లా, అజ్మతుల్లా, ఫర్జుల్లా చాంద్‌బాషా, నాగయ్య తదితరులు ఆధ్వర్యంలో ముస్లిం సంప్రదాయంలో ఆ వృద్ధుడికి అంత్యక్రియలు నిర్వహించారు.

తిరునాళ్లను విజయవంతం చేయాలి

మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్షలో

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు


సమావేశంలో మాట్లాడుతున్న చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చినగంజాం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ, పోలీసు, గ్రామ పంచాయతీ అధికారులు సమన్వయంతో పని చేసి మహాశివరాత్రి తిరునాళ్ల విజయవంతానికి కృషి చేయాలని చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాల్‌లో ఈ నెల 26వ తేదీన జరుగనున్న మహాశివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకొని రెవెన్యూ, పోలీసు, గ్రామ కార్యదర్శులు, పలుశాఖల అధికారులు బాలకోటేశ్వర, రామకోటేశ్వర స్వామి దేవస్థానాల కమిటీ సభ్యులతో బుధవారం జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్డీవో మాట్లాడుతూ కొత్తపాలెంలోని బాలకోటేశ్వరస్వామి, సోపిరాలలోని రామకోటేశ్వరస్వామి ఆలయాల వద్ద తాగనీరు, పారిశుధ్యం సమస్య తలెత్తకుండా దృష్టి సారించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు, గ్రామ పంచాయతీ అధికారులతో టీమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తిరునాళ్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ ఏఈ పి.గణనారాయణను ఆదేశించారు. వాహనాల రాకపోకలకు సమస్య లేకుండా పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆలయాల ప్రాంగణాల్లో రాకపోకలకు ఇబ్బంది లేకుండా షాపులు క్రమపద్ధతిలో ఏర్పాటు చేయాలన్నారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయాల వద్ద విద్యుత్ ప్రభల వద్ద నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను ఇచ్చిన సమయానికే నిలిపి వేయాలని చీరాల డీఎస్పీ మహమ్మద్ మెయిన్ సూచించారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, రాకపోకల సమస్యలు లేకుండా బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముందుగా బాలకోటేశ్వరస్వామి, రామకోటేశ్వరస్వామి ఆలయాలను చీరాల ఆర్డీవో, చీరాల డీఎస్పీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆర్డీవో, డీఎస్పీ, ఇంకొల్లు సీఐ, రమణయ్య, ఎస్ఐ శీలం రమేష్, తహసీల్దార్ జె.ప్రభాకరరావు, ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బి.బసవరాణి, టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్యను రామకోటేశ్వర స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ డాక్టర్ టీఎస్ఆర్ ఆంజనేయనులు, సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆలయంలో అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చినగంజాం సర్పంచ్ రాయని ఆత్మారావు, చినగంజాం, సంతరావూరు పీహెచ్‌సీల వైద్యాధికారులు పీ.సాయిశ్రీచరణ్, బి.నాగేంద్ర, రామకోటేశ్వరస్వామి, బాలకోటేశ్వరస్వామి దేవస్థానాల కమిటీల సభ్యులు, చినగంజాం, కొత్తపాలెం గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

26న కొండాయపాలెంలో మహా రుద్రాభిషేకం

బల్లికురవ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాయపాలెం గ్రామంలో మహా శివరాత్రిని పురస్కరించుకొని 26వ తేదీన మహా రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలో ఉన్న గంగాపార్వతీ సమేత నీలకంఠేశ్వర స్వామి దేవాలయం వద్ద మట్టి శివలింగానికి రుద్రాభిషేకం జరుగుతుందని భక్తులు పాల్గొనాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలు భవితకు సోపానాలు


కడవకుదురు పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈవో అజయ్‌బాబు

చినగంజాం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలు బాలల భవితకు సోపానాలని ఎంఈవో-1 అజయ్‌బాబు అన్నారు. మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన జ్ఞాన జ్యోతి మొదటి విడత శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిక్షణలో ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు శారీరక అభివృద్ధి, భాషాభివృద్ధి, మేధాభివృద్ధి, సామాజిక భావోద్వేగ అభివృద్ధి, సౌందర్య - సాంస్కృతిక అభివృద్ధిపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. చిన్నారులకు ఆటపాటలతో విద్య నేర్పించడంపై హెచ్‌ఎం, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ల కే.వాణిశ్రీ, ఎన్.సుమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యద్దనపూడి : మెరుగైన బోధనను అందిస్తామనే నమ్మకాన్ని తల్లిదండ్రులకు కలిగించినపుడే కేంద్రాలలో చిన్నారుల సంఖ్య పెరుగుతుందని ఎఫ్ఎల్ఎన్ జిల్లా కోఆర్డినేటర్ సుభాని అన్నారు. యద్దనపూడి జడ్పీ హైస్కూల్‌లో అంగన్‌వాడీ టీచర్లకు జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కేంద్రాన్ని బుధవారం సుభాని సందర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దేవేంద్రరావు, రిసోర్‌పర్సన్‌లు వంశీకృష్ణ, శీనివాసరావు, వెంకట్రామయ్య, దీపాదేవి పాల్గొన్నారు.

మార్టూరు : చిన్నపిల్లలకు ఆటపాటలతో కూడిన చదువును నేర్పాలని అంగన్‌వాడీ టీచర్లను ఎంఈవో వస్రాంనాయక్ కోరారు. బుధవారం మండలంలోని కోలలపూడి, వలపర్ల గ్రామాలలో జరుగుతున్న శిక్షణ తరగతులను సందర్శించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లు బి రాంబాబు, యెహోషువ, సీఆర్పీలు శ్రీనివాస్, తిరుపతమ్మ పాల్గొన్నారు.

పర్చూరు : పిల్లల్లో అభ్యసనా సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా జ్ఞాన జ్యోతి శిక్షణ లక్ష్యమని శిక్షకుడు బాలకోటేశ్వరావు అన్నారు. మండలం, చెరుకూరు జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీల శిక్షణ తరగతులు రెండో రోజు ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలన్న సంకల్పంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శిక్షణను కార్యకర్తలు వినియోగించుకోవాలని బాలకోటేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూలీల ఆటోను ఢీకొన్న స్కూల్ బస్సు

ఐదుగురు మహిళలు, ఆటోడ్రైవర్‌కు గాయాలు


క్షతగాత్రుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై వెంకటరావు

చీరాలటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఎదురుగా వస్తున్న స్కూల్ బస్సు ఢీకొని ఐదుగురు మహిళలు, ఆటో డ్రైవర్ గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఇంకొల్లుకు చెందిన సుమారు 8 మంది మహిళ వ్యవసాయ కూలీలు బుధవారం ఉదయం కేశవరప్పాడులో వ్యవసాయ కూలి పనులకు ఆటోలో వెళుతున్నారు. ఈక్రమంలో మార్గమధ్యలో జరుబులవారిపాలెం బ్రిడ్జి సమీపంలో ఆటోకు ఎదురుగా స్కూల్ బస్ వస్తుంది. ఆప్రాంతంలో మార్జిన్ తక్కువగా ఉండడంతో అప్పటికే గ్రహించిన ఆటో డ్రైవర్ కోటేశ్వరరావు ఆటోను కొంచెం రోడ్డు పక్కకు నిలిపాడు. అయినా వేగం నియంత్రణ చేసుకోకుండా స్కూల్ బస్ వీరి ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటో రోడ్డు పక్కన ముళ్లపొదల్లోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఆటోలో ఉన్న స్వప్న, శిరీష, బుల్లెమ్మాయి, భారతి, రుక్సానాతో సహా ఆటో డ్రైవర్ గాయపడ్డారు. దీంతో స్థానికులు 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్సను అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం స్థానికంగా ఉన్న ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రమాదంలో కొందరు స్వల్పంగా మరి కొందరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న కారంచేడు ఎస్సై వెంకటరావు హాస్పిటల్‌కు చేరుకుని క్షతగాత్రుల నుంచి సంఘటనపై ఆరా తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి జెన్నెమ్మ, పక్కన డీఆర్‌డీఏ పీడీ పద్మ

షేడ్‌నెట్ వ్యవసాయం లాభదాయకం

మార్టూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులవైపు మొగ్గుచూపాలని, షేడ్‌నెట్ ద్వారా సాగు లాభదాయకంగా ఉంటుందని ఉద్యాన అధికారి పీ జెన్నెమ్మ అన్నారు. బుధవారం మార్టూరు మండల సమాఖ్య కార్యాలయంలో రైతులకు షేడ్‌నెట్‌పై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మ, జిల్లా ఉద్యాన అధికారి జెన్నెమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ 50 శాతం రాయితీతో షేడ్‌నెట్‌ను ఉద్యానశాఖ ద్వారా అందిస్తామన్నారు అదేవిధంగా మిగిలిన 50 శాతం స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంక్ లింకేజీ ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. షేడ్‌నెట్‌లపై ఆసక్తి ఉన్న రైతులు మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీఎంను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీడీ చంద్రశేఖర్, డీపీఎం ఎల్‌హెచ్ రామమోహన్, ఉద్యాన అధికారి హనుమంతనాయక్, ఏపీఎం సురేంద్ర, ఏసీ లక్ష్మణాచారి, సీసీలు, రైతులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాల రికవరీలో జాప్యం తగదు

పంగులూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : స్త్రీనిధి రుణాల రికవరీలో జాప్యం తగదని, పూర్తి స్థాయిలో వసూలు చేయాలని స్త్రీనిధి ఏజీఎం బాబూరావు అన్నారు. పంగులూరు వెలుగు కార్యాలయంలో బుధవారం జరిగిన వీవోఏల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేణంగివరం, కొండమూరు, కొండమంజులూరు, కోటపాడు గ్రామాలలో స్త్రీనిధి రుణ రికవరీ సరిగా లేదని, ఆర్థిక సంవత్సరం మార్చితో ముగియనునుండున త్వరితగతిన రికవరీలు పూర్తిచేయాలన్నారు. లోకోస్ యాప్‌లో ఎస్ఎల్‌జీ వివరాలను నమోదు చేయాలని ఏపీఎం జ్యోతిప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్ శ్రీనివాసరావు, సీసీలు సాల్మన్, సురేష్, వీవోఏలు పాల్గొన్నారు.

దేవదాయ స్థలాల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలో దేవదాయ స్థలాలు ఆక్రమణలు జరుగుతున్నాయని వాటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలానీ అన్నారు. స్థానికంగా ఉన్న టీటీడీ కల్యాణ మండపం వెనుక వైపు కొంత మంది ముందుగా షెడ్లు వేసుకుని ఆక్రమిస్తున్నారని అన్నారు. కొద్దిరోజుల తరువాత వాటిని అమ్ముకుని అక్కడ నుంచి జారుకుంటున్నారని జిలానీ ఆరోపించారు. అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డీటీ అర్జున్‌కు వినతిపత్రం అందజేశారు.

ముప్పవరంలో రోడ్డెక్కిన మురుగు


ముప్పవరం ప్రధాన రహదారిలో సీసీ రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

పంగులూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పవరం గ్రామ ప్రధాన రహదారిలో సీసీ రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తోంది. పంగులూరు వైపు నుంచి ముప్పవరంలోకి ప్రవేశించే సీసీ రోడ్డులో కొంతదూరం మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. ఈ ప్రధాన రహదారిలో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనచోదకులు రోడ్డుపై పేరుకున్న పాచితో కుడిన మురుగుపై వాహనం స్కిడ్డయి ప్రమాదాల బారిన పడుతున్నారు. రోజులతరబడి ప్రవహిస్తున్న మురుగు రోడ్డుపై నిలవడంతో పాచి పేరుకుని పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. మురుగు రోడ్డెక్కకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు

స్థల వివాదంలో వ్యక్తిపై దాడి

చీరాలటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : స్థలం వివాదంలో వ్యక్తిపై మరోవ్యక్తి దాడి చేశాడు. దీంతో బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పాపరాజు తోటకు చెందిన గరిక వినోద్, రాజేష్‌కు స్థలం హద్దుల విషయంలో వివాదం ఉంది. ఈక్రమంలో రాజేష్ బుధవారం ఉదయం వినోద్ తలపై ఇనుప రాడ్డుతో దాడిచేసి గాయపరిచాడు. ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశాడు. దీంతో తీవ్ర గాయాలుపాలైన బాధితుడు వినోద్ చీరాల ఏరియా వైద్యశాలలో చేరి చికిత్స పొందాడు. ఈమేరకు అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

మురుగు ప్రవాహానికి తొలగిన అడ్డంకి


పూడికను తొలగించిన తరువాత కాలువ


అద్దంకి మేజర్ కాలువలో పూడిక తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

అద్దంకి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని పలు కాలనీ వాసులను పట్టి పీడిస్తున్న మురుగు నీటి సమస్య పరిష్కారం కోసం తాత్కాలిక చర్యలకు మున్సిపల్ అధికారులు ఉపక్రమించారు. అద్దంకి పట్టణంలోని అభ్యుదయ నగర్ నుండి రామ్‌నగర్ వరకు ఉన్న అద్దంకి మేజర్ కాలువ కాస్తా ఆయా ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీరు నిలిచి మురుగు కూపంగా మారింది. మురుగు ప్రవాహానికి అడ్డంకులు ఉండడంతో ఎక్కడికక్కడే నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. వ్యాధులు విజృంభించే అవకాశం ఉండడంతో మున్సిపల్ అధికారులు ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేసి తాత్కాలికంగా మురుగు నీరు ప్రవహించే విధంగా పూడిక తీత పనులు చేస్తున్నారు. అయితే పలు చోట్ల కాలువను ఆక్రమించి నిర్మాణాలు ఉండటంతో మురుగు నీరు ప్రవాహం కొంత దూరం మాత్రమే సాగే అవకాశం ఉంది. ఎట్టకేలకు తాత్కాలికంగానైనా పూడిక తీత పనులు చేపట్టడంతో కొద్ది రోజుల పాటు దుర్వాసన నుంచి విముక్తి లభించే అవకాశం కలిగింది.